పీఎఫ్ మొత్తాన్ని ఎప్పుడు,
ఎలా తీసుకోవచ్చో మీకు తెలుసా?
తాజా బిజినెస్ వార్తలు, ప్రత్యేక కథనాలు,
ఆర్థిక సందేహాల నివృత్తి, ఈ-బుక్స్‌కై
మీ www.eenadusiri.net చూడండి.

# ఈనాడు

SPEEDY GOLD LOAN
మీ బంగారు ఆభరణాలపై తక్షణమే రుణం
నెలకు వడ్డీ కేవలం 95 పైసలు మాత్రమే
ప్రతి గ్రాముపై అత్యధిక ఋణం
SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
040 42915112 SCUF GOLD to 54999 MISSED CALL 044-30123479

కరీంనగర్ 16-8-2019 శుక్రవారం సిటీ సంపుటి 46 సంచిక 7
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50. పేజీలు 14+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



# 70 ఏళ్లలో సాధ్యం కానిది.. రోజుల్లో చూపించాం

## నవ భారత నిర్మాణానికి కలిసి రండి

- త్రివిధ దళాల మధ్య సమన్వయం కోసం కొత్తగా సీడీఎస్ పదవి
- జల్ జీవన్ మిషన్‌కు రూ.3.50 లక్షల కోట్లు
- మౌలిక వసతుల కల్పనకు రూ. 100 లక్షల కోట్ల వ్యయం
- అక్టోబర్ నుంచి ప్లాస్టిక్‌పై ఉద్యమం
- ఎర్రకోట నుంచి ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

జమ్మూ-కశ్మీర్‌ను ముందుకు తీసుకెళ్లడానికి, సమస్యను పరిష్కరించడానికి 70 ఏళ్లలో ప్రతి ప్రభుత్వమూ శ్రమించింది. కానీ అనుకున్న ఫలితాలు రాలేదు. మేము రెండోసారి అధికారంలోకి వచ్చిన 70 రోజుల్లోనే పరిష్కరించి చూపాం.

2లో

నవీన భారత నిర్మాణానికి ప్రతి భారతీయుడు కలసిరావాలి. దేశాన్ని ముందుకు తీసుకెళ్దాం. మార్పును సాకారం చేద్దాం. అభివృద్ధి పథంలో సమున్నత శిఖరాలను అధిరోహిద్దాం.

# చట్టాల బూజు దులుపుతున్నాం

- అవినీతి, అలసత్వానికి చెల్లుచీటీ
- త్వరలో కొత్త రెవెన్యూ చట్టం
- ఇక ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు ఇబ్బందులు ఉండవు
- గ్రామాలు, పట్టణాల సమగ్రాభివృద్ధికి 60 రోజుల ప్రణాళిక
- ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యదీక్షతో పనిచేయాలి
- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రసంగం



గోల్కొండ కోటలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న సీఎం కేసీఆర్

తెలంగాణ రైతాంగ విధానం దేశానికి ఆదర్శం అయింది. వ్యవసాయాభివృద్ధి కోసం ఐక్యరాజ్యసమితి ప్రపంచవ్యాప్తంగా అమలయ్యే గొప్ప కార్యక్రమాలతో రూపొందించిన జాబితాలో మన రైతుబంధు, రైతు బీమా పథకాలను చేర్చడం గర్వకారణం.

ఉద్యోగావకాశాలు స్థానికులకే ఎక్కువ దక్కాలనే లక్ష్యంతో కొత్త జోనల్ వ్యవస్థను తెచ్చాం. 95 శాతం స్థానికులకే దక్కేలా చట్టం చేసి, దాని ప్రకారమే ఉద్యోగ నియామకాలు జరుపుతున్నాం.

– ముఖ్యమంత్రి కేసీఆర్ 5లో

### ఇంటర్ వివాదం పెద్ద కుట్ర

- ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు కొందరు ఈ కథ నడిపారు 2లో
- చివరికి ఏమీ లేదని తేలింది
- తేనీటి విందులో గవర్నర్‌తో కేసీఆర్





### కశ్మీర్‌పై నేడు ఐరాసలో రహస్య సంప్రదింపులు!

భేటీ జరపాలని భద్రతా మండలికి లేఖ రాసిన పాక్

వంతపాడిన చైనా 11లో





### పంట చేలో వాలిన లోహ విహంగం

- రష్యా విమానం అత్యవసర ల్యాండింగ్, 23 మందికి గాయాలు
- ప్రమాద సమయంలో 233 మంది ప్రయాణికులు

3లో

# మనకూ ముప్పు?



- 19 ఏళ్ల కనిష్ఠానికి వాహన విక్రయాలు
- ఖరీదైన వస్తువుల జోలికెళ్లని జనం
- ఇవన్నీ ఆర్థిక మాంద్యం సంకేతాలేనా?

బిస్కట్ ప్యాకెట్ కొనాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు.
– బ్రిటానియా లిమిటెడ్ ఎండీ వరుణ్ బెర్రీ

ఈ ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 6.5% దాటకపోవచ్చు. ప్రభుత్వం 7% వృద్ధి ఉంటుందని చెబుతోంది, కానీ 6.5% నమోదైనా అదృష్టమే. ప్రైవేటు రంగానికి ఇది క్లిష్టమైన సమయం.
– ఎల్అండ్‌టీ లిమిటెడ్ వార్షిక సమావేశంలో ఛైర్మన్ ఏ.ఎం.నాయక్

మాంద్యం లక్షణాలు కనిపిస్తున్నాయి. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ), గృహరుణ సంస్థలకు నగదు లభ్యత లేకపోవటం, అప్పులిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రాకపోవటం దీనికొక ముఖ్యమైన కారణం.
– హెచ్‌డీఎఫ్‌సీ ఛైర్మన్ దీపక్ పరేఖ్

ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ఆర్థిక మాంద్యం సంకేతాలు భారత్‌లోనూ కనిపిస్తున్నాయా..? దేశ ఆర్థికరంగంలో జరుగుతున్న పరిణామాలు, నిపుణుల అభిప్రాయాలను పరిశీలిస్తుంటే పరిస్థితి పూర్తి సజావుగా లేదని స్పష్టమవుతోంది. బంగారం ధర ఆకాశాన్నంటుతోంది. వాహనరంగంసహా పలు రంగాల్లో అమ్మకాలు పతనమవుతున్నాయి. స్టాక్‌మార్కెట్లు పతనం అవుతున్నాయి. ఇవన్నీ మన దేశం కూడా ఆర్థికమాంద్యానికి దగ్గరవుతోందన్న సూచనలిస్తున్నాయి. ఈ పరిస్థితులను సరిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు మొదలుపెడుతోంది. ...వివరాలు 14లో



# మెట్రో రికార్డ్

### 3 లక్షలు దాటిన ప్రయాణికులు

మెట్రో ఒకరోజు ప్రయాణికుల్లో ఇదే అత్యధికం

మెట్రోరైలు.. ప్రయాణికుల పరంగా 3 లక్షల మైలురాయిని అధిగమించింది. రికార్డు స్థాయిలో బుధవారం 3.06 లక్షల మంది ప్రయాణించారు. మెట్రో ప్రారంభం తర్వాత ప్రయాణికుల సంఖ్య పరంగా ఇప్పటివరకు ఇదే అత్యధికం. గత జూన్ 7న ఒక్క రోజు అత్యధికం 2.78 లక్షలు కాగా.. జూన్ 22న 2.89 లక్షలు. ఇప్పుడు మూడు లక్షల మంది ప్రయాణికులు అనే మైలురాయిని దాటి కొత్త రికార్డు నెలకొల్పింది.

...పూర్తి వివరాలు 3లో

# తప్పాలంటే విలయం దాటాలి వలయం



- అవుటర్ చుట్టూ 13 నగరాలు ఏర్పాటు చేయాలన్న నిపుణులు
- ఈ ప్రతిపాదనల్లో ఒక్క కోకాపేటలోనే కదలిక
- నివేదిక దుమ్ము దులిపితేనే ప్రయోజనం


ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

దేశంలోనే అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం హైదరాబాద్. ఇక్కడ అభివృద్ధి అంతా కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడంతో భవిష్యత్తులో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలతో పాటు జనజీవనానికి ఎంతో ఇబ్బంది తలెత్తనుంది. బాహ్యవలయ రహదారి చుట్టూ (ఓఆర్ఆర్) 13 నగరాలను ఏర్పాటు చేస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) కొన్నేళ్ల కిందటే నివేదికను రూపొందించింది. ఈ నివేదిక బుట్టదాఖలైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అవుటర్ చుట్టూ చిన్న నగరాల దిశగా చర్యలు తీసుకోవాలని నిపుణులు కోరుతున్నారు.

### మరిప్పుడు ఏం చేయాలి?

బాహ్యవలయ రహదారికి రెండు వైపులా.. దాదాపు 50 వేల ఎకరాల ప్రైవేటు భూమి ఉంది. అవుటర్‌కు ఆనుకుని ఉండే సర్వీస్ రోడ్డులోకి రావడానికి వీలుగా గ్రిడ్ రోడ్లు లేకపోవడంతో ఈ భూమి కొన్నేళ్లుగా అభివృద్ధి చెందడం లేదు. ఈ భూమిని వినియోగంలోకి తెచ్చి అవుటర్ చుట్టూ 13 నగరాలు ఏర్పాటు చేస్తే రాజధాని విస్తరిస్తుందని హెచ్ఎండీఏ ...మిగతా 2లో

- కోకాపేటలో ఐటీతోపాటు వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలతో కూడిన హబ్‌ను ఏర్పాటు చేయాలని ఇటీవలే ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 500 ఎకరాలను కేటాయిస్తున్నారు.





### ఏ దేశమేగినా అక్కడికే ధ్రువపత్రాలు



- విమాన పార్శిల్‌లో పంపనున్న జేఎన్‌టీయూహెచ్ 6లో
- బ్లూ డార్ట్‌తో కొలిక్కివచ్చిన ఒప్పందం
- ఈనెల నుంచే సేవలు ప్రారంభం

### శ్రీశైలం.. సాగర్‌లకు నిలకడగా వరద



- పులిచింతల నుంచి దిగువకు ఆరు లక్షల క్యూసెక్కులు 6లో
- ఎగువన తగ్గుతున్న ప్రవాహం

### నదీమ తల్లి... పొంగిపొర్లి..

- రిజర్వాయర్లలో పదేళ్ల కంటే ఎక్కువ నీటి లభ్యత 6లో
- 64 శాతం నీటి నిల్వలు
- ఈ నెల వర్షాలతో మెరుగుపడిన పరిస్థితి

### చితికిన మమకార బంధం!

- అన్నకు రాఖీ కట్టి వస్తూ ప్రమాదానికి గురైన చెల్లి కుటుంబం
- భార్య, భర్త, కుమార్తె మృతి 3లో
- తీవ్ర గాయాలతో బయటపడిన కుమారుడు

### ఆరోగ్యశ్రీ రోగులకు చికిత్స నిరాకరించొద్దు

- బోధనాసుపత్రులకు వైద్య విద్య సంచాలకుల ఆదేశాలు 14లో

# 70 ఏళ్లలో సాధ్యం కానిది 70 రోజుల్లో చూపించాం

ఈనాడు - దిల్లీ

నవీన భారత్‌ను ఆవిష్కరించే దిశగా ప్రతి భారతీయుడూ నడుం బిగించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని, మార్పును సాకారం చేయాలని కోరారు. అభివృద్ధి పథంలో సమున్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. వీటిని ప్రభుత్వం, 130 కోట్ల మంది ప్రజలు కలసికట్టుగా సాధించాలని ఉద్ఘాటించారు. ఈ దిశగా దేశం సాధించాల్సిన లక్ష్యాలను ఆయన వివరించారు. "ఈ దేశ ప్రధాని కూడా మీలా ఒక సామాన్యుడే. అందువల్ల మనం అంతా కలిసి పనిచేయాలి. రాబోయే రోజుల్లో

> ఇప్పుడు ప్రజల ఆలోచనలు మారిపోయాయి. ఒకప్పుడు రైల్వే స్టాప్ తోనే సంతృప్తి చెందే ప్రజలు ఇప్పుడు రైల్వేస్టేషన్ వచ్చినా సంతోష పడకుండా విమానాశ్రయం ఎప్పుడొస్తుందని అడిగే స్థాయికి చేరారు. మారుతున్న ఆలోచనలు, పరిస్థితుల ఆధారంగా ప్రపంచస్థాయి ప్రమాణాలను అందుకోవాలి.

గ్రామాల్లో 1.50 లక్షల ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వైద్య వృత్తిని చేపట్టాలనుకున్న యువకుల కలను నెరవేర్చేందుకు మూడు లోక్‌సభ స్థానాలకో వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలి. రెండు కోట్ల ఇళ్లు నిర్మించాల్సి ఉంది. 15 కోట్ల గ్రామీణ ఇళ్లకు తాగునీరు అందించాల్సి ఉంది. 1.25 లక్షల కిలోమీటర్ల గ్రామీణరోడ్లు నిర్మించాల్సి ఉంది. ప్రతి గ్రామాన్నీ బ్రాడ్‌బ్యాండ్‌తో అనుసంధానించాలి. 50వేలకుపైగా కొత్త అంకురపరిశ్రమలకు జీవం పోయాల్సి ఉంది. మన లక్ష్యం హిమాలయం అంత ఉన్నతమైందే. మన ఉత్సాహానికి ఆకాశమూ హద్దు కాదు. మన సామర్థ్యం హిందూ మహాసాగరం కన్నా లోతైంది. మన ప్రయత్నం గంగాధార కంటే పవిత్రమైంది. వేల సంవత్సరాల మనుషులు, రుషుల తపస్సు, జాతి నిర్మాతల త్యాగం ప్రేరణగా తీసుకొని నవ భారత నిర్మాణం కోసం సరికొత్త ఆత్మవిశ్వాసంతో ముందుకు కదులుదాం" అని మోదీ పిలుపునిచ్చారు. భారత 73వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని గురువారం ఇక్కడ ఎర్రకోటలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి అనంతరం జాతినుద్దేశించి గంటన్నరపాటు ప్రసంగించారు. గత అయిదేళ్లలో చేసిన పనులు, వచ్చే అయిదేళ్లలో సాధించబోయే లక్ష్యాలను వివరించారు. ప్రభుత్వ, ప్రజల బాధ్యతలను గుర్తుచేశారు. భారత త్రివిధ దళాలను మరింత శక్తిమంతంగా తీర్చిదిద్దేందుకు రక్షణ బలగాల అధిపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్-సీడీఎస్)ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. మోదీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

> సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు గానీ, మోదీ గానీ పోటీపడలేదు. సామాన్యుడే పోటీ చేశాడు. 130 కోట్ల మంది తమ కలల సాకారానికి పోటీపడ్డారు. అందుకే అసలైన ప్రజాస్వామ్య రూపం ఈ ఎన్నికల్లో కనిపించింది.

### జమ్మూ-కశ్మీర్‌పై ముందడుగు

జమ్మూ-కశ్మీర్‌ను ముందుకు తీసుకెళ్లడానికి 70 ఏళ్లలో ప్రతి ప్రభుత్వమూ శ్రమించింది. కానీ అనుకున్న ఫలితాలు రాలేదు. దీంతో కొత్త నిర్ణయాల అవసరం ఏర్పడింది. జమ్మూ-కశ్మీర్, లద్దాఖ్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి. 130 కోట్లమంది ఆ బాధ్యతను తీసుకున్నారు. గత 70 ఏళ్లలో ఈ వ్యవస్థ వేర్పాటువాదులు, ఉగ్రవాదులకు బలాన్నిచ్చింది. ఇప్పుడు జమ్మూ-కశ్మీర్, లద్దాఖ్‌లు అభివృద్ధి, శాంతికి తార్కాణంగా నిలవనున్నాయి. అక్కడి ప్రజలు నేరుగా దిల్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వాతావరణాన్ని నెలకొల్పాం. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు '370'కి మద్దతుగా ఏదో ఒకటి మాట్లాడుతూ ఉన్నారు. నాకు మాత్రం దేశ భవిష్యత్తే ముఖ్యం. దాని ముందు రాజకీయ భవిత తృణప్రాయం. రాజ్యాంగ నిర్మాతలు, సర్దార్ పటేల్ లాంటి మహా పురుషులు దేశ ఐక్యత కోసం ధైర్యంగా నిర్ణయాలు తీసుకొని విజయవంతంగా అమలుచేశారు. ఇప్పుడు మేం ఒకే దేశం.. ఒకే రాజ్యాంగం విధానాన్ని తెచ్చామని ఎర్రకోటమీది నుంచి గర్వంగా చెబుతున్నాం.

### ముమ్మారు తలాక్‌పై చట్టమెందుకు వేయలేం?

ముస్లిం ఆడపడుచుల హక్కులు కాపాడటానికి ముమ్మారు తలాక్‌కు వ్యతిరేక చట్టం తీసుకొచ్చాం. సమస్యలను మూలాల నుంచే పెకలించడానికి ప్రయత్నించాలి. ప్రపంచంలో చాలా ఇస్లామిక్ దేశాలు ఈ సంస్కృతిని ఎప్పుడో రద్దు చేశాయి. దేశంలో మాత్రం తటపటాయించాం. ఇక్కడ సతీ సహగమనానికి ముగింపు పలికినప్పుడు, భ్రూణ హత్యలకు వ్యతిరేకంగా చట్టాలు చేసినప్పుడు, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గొంతెత్తినప్పుడు, వరకట్నానికి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకున్నప్పుడు ముమ్మారు తలాక్‌పై ఎందుకు గొంతెత్తకూడదు? తలాక్‌పై నిర్ణయం.. రాజకీయ తులాభారంతో తూచే నిర్ణయం కాదు.

### రక్షణ దళాలకు సమర్థ నాయకత్వం

సైనిక దళాల్లో సంస్కరణలపై ఎన్నో కమిషన్లు కసరత్తు చేసి నివేదికలు ఇచ్చాయి. వాటి సారం ఒక్కటే. దేశంలోని త్రివిధ దళాల మధ్య మంచి సమన్వయం ఉంది. విడివిడిగా అవి ఆధునిక రూపం సంతరించుకోవడానికి ప్రయత్నించాయి. ఇప్పుడు ప్రపంచం మారుతోంది. యుద్ధరీతులు మారుతున్నాయి. సాంకేతికత పెరిగింది. అందువల్ల భారత్ కూడా విషయాలను ముక్కలుముక్కలుగా ఆలోచించే పరిస్థితులు పోయాయి. త్రివిధ దళ సైన్యాన్ని ఒకే పంథాలో ముందుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకటి ముందు ఒకటి వెనుక ఉంటే సైన్యం ముందుకు కదిలే పరిస్థితి ఉండదు. అందుకే ఇప్పుడు రక్షణ బలగాల అధిపతి (సీడీఎస్)ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దీనివల్ల త్రివిధ దళాలకు ప్రభావవంతమైన నాయకత్వం లభిస్తుంది.

### జమిలి ఎన్నికలపై చర్చ సాగనివ్వండి

జీఎస్టీ రూపంలో 'ఒకే దేశం.. ఒకే పన్ను' కలను సాకారంచేశాం. విద్యుత్తు రంగంలో 'ఒకే దేశం ఒకే గ్రిడ్' కలను నెరవేర్చాం. 'వన్ నేషన్.. వన్ మొబిలిటీ కార్డ్' వ్యవస్థనూ తెచ్చాం. ఇప్పుడు ఒకే దేశం ఒకేసారి ఎన్నికలు అన్న చర్చ దేశవ్యాప్తంగా విస్తృతంగా జరుగుతోంది. దీనిపై ప్రజాస్వామ్య బద్ధంగా చర్చ జరగాలి.

### ఇంటింటికీ తాగునీరు

స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా దేశంలోని దాదాపు సగం ఇళ్లకు తాగునీరు అందుబాటులో లేదు. గుక్కెడు నీటికోసం ఆడపడుచులు కుండలు పట్టుకొని కిలోమీటర్ల కొద్దీ నడిచివెళ్లే పరిస్థితి ఉంది. అందుకే ఇంటింటికీ ఎలా నీరందించాలన్న దానిపై దృష్టిపెట్టాం. దీన్ని పరిష్కరించడానికి 'జల్‌జీవన్ మిషన్'తో ముందుకెళ్లబోతున్నాం. దీని కోసం రూ.3.50 లక్షల కోట్లు ఖర్చుపెట్టాలని నిర్ణయించాం.

### కుటుంబ నియంత్రణ తప్పనిసరి

ఇప్పటివరకు రాజకీయ ప్రయోజనాల దృష్టితో నిర్ణయాలు జరిగాయి. దీనివల్ల భావితరాలు నష్టపోతూ వచ్చాయి. అందుకు ఉదాహరణ జనాభా పెరుగుదల. దేశంలోని చైతన్యవంతమైన సమాజం దీన్ని బాగా అర్థం చేసుకుంది. పుట్టబోయే బిడ్డకు న్యాయం చేయగలమా? లేదా? అని ఆలోచిస్తున్నారు. ఎంతోమంది కుటుంబాన్ని పరిమితం చేసుకొని తమవారితోపాటు, దేశానికీ బలం చేకూరుస్తున్నారు. అలాంటి వారంతా గౌరవనీయులే. కుటుంబ నియంత్రణ పాటించి గౌరవప్రద జీవితం గడుపుతున్నవారి గురించి దాన్ని పాటించనివారికి తెలియజెప్పి, జనాభా పెరుగుదలను అరికట్టాలి.

### ప్లాస్టిక్‌పై యుద్ధం

అక్టోబరు 2 నుంచి ఒకసారి వాడి పారేసే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నుంచి దేశానికి విముక్తి కల్పించాలి. మహాత్ముడి స్ఫూర్తితో ఆ ప్లాస్టిక్‌ను సేకరించే పని మొదలుపెట్టాలి. సంచులను ఇంటి నుంచి తెచ్చుకోవాలంటూ వ్యాపారులంతా తమ దుకాణాల్లో బోర్డులు పెట్టాలి. లేదంటే వస్త్ర సంచులు అమ్ముతాం.. తీసుకెళ్లండి అని చెప్పాలి. దీపావళికి బహుమతులు పంచే వ్యాపారులు ఆ స్థానంలో తమ కంపెనీ పేర్లు ముద్రించిన ఇలాంటి సంచులు బహుమతిగా ఇవ్వండి.

### చెదపురుగుల్లా పాకిన అవినీతి

అవినీతి, ఆశ్రిత పక్షపాతం దేశానికి నష్టం చేకూర్చింది. చెదపురుగుల మాదిరి మన జీవితంలోకి అవి చొరబడ్డాయి. వాటిని అంతమొందించడానికి మేం నిరంతరం శ్రమిస్తున్నాం. కొన్ని ఫలితాలు వచ్చాయి. కానీ రోగం బాగా ముదిరిపోయింది. దాన్ని అంతమొందించడానికి ప్రజలూ కలిసిరావాలి. నయం అయినట్లు కనిపించినా అవకాశం వచ్చినప్పుడు మళ్లీ తిరగబెట్టే రోగం ఇది. సాంకేతికతను ఉపయోగించుకొని దీనికి చికిత్స చేస్తున్నాం.

### ఐదేళ్లలో 5లక్షల కోట్ల డాలర్ల స్థాయికి..

ఐదేళ్లలో మన ఆర్థిక వ్యవస్థను 5లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్తాం. అదే కాలంలో రైతుల ఆదాయం రెట్టింపు చేయడం, ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించడం, ప్రతి ఇంటికీ కరెంటు ఇవ్వడం, ప్రతి గ్రామానికి ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ఏర్పాటుచేయడం మన లక్ష్యాలు. మనం ప్రపంచానికి విపణిగా మారడంకాదు, ప్రపంచ మార్కెట్లో మన వస్తువులను అమ్మేందుకు శ్రమించాలి. చిన్నచిన్న దేశాలకున్న శక్తి మన దేశంలోని ఒక్కో జిల్లాకు ఉంది. దాన్ని సంఘటితం చేసి ప్రతి జిల్లాను ఒక ఎగుమతి కేంద్రంగా మార్చాలి.

### నగదు వద్దు... డిజిటల్ చెల్లింపులు ముద్దు

పారదర్శకత, జవాబుదారీతనం, బలమైన ఆర్థిక వ్యవస్థకోసం గ్రామాలు, పట్టణాల్లోని చిన్న దుకాణాల్లోనూ డిజిటల్ చెల్లింపులు చేపట్టాలి. 'డిజిటల్ చెల్లింపులు ముద్దు.. నగదు చెల్లింపులు వద్దు' అని వ్యాపారులు బోర్డులు పెట్టాలి.

### 15 పర్యాటక ప్రాంతాల సందర్శన

దేశంలో మధ్య, ఉన్నత మధ్య తరగతి వర్గం పెరుగుతోంది. కుటుంబంతో సహా వారు ఏటా ఒకటి రెండుసార్లు విదేశాలకు వెళుతున్నారు. అది మంచి అలవాటే. ఇప్పుడు ఆ కుటుంబాలన్నీ 2022 నాటికి దేశంలోని 15 పర్యాటక ప్రాంతాలను చుట్టిరావాలని కోరుతున్నా. సరైన వసతులు, హోటళ్లు లేకున్నా వెళ్లిచూడండి. దీనివల్ల దేశంలోని యువతకు మెరుగైన ఉపాధి కలుగుతుంది.

> పేదలకు గౌరవం లభిస్తే వారిలో స్వాభిమానం ఉదయిస్తుంది. అప్పుడు వారు పేదరికంపై పోరాటంలో ప్రభుత్వ సాయం కోసం చూడరు. స్వశక్తితో దాన్ని ఓడించడానికి ప్రయత్నిస్తారు. ఎంతటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనే శక్తిసామర్థ్యాలు పేదలకు మాత్రమే ఉన్నాయి. వాటిని మేల్కొల్పుదాం.


> దేశంలో సంపద సృష్టించడానికి శ్రమించేవారంతా దేశానికి సేవ చేస్తున్నవారే. వారిని అనుమానపు కళ్లతో చూడొద్దు. వారిని గౌరవించడం మన బాధ్యత. సంపద సృష్టి సాధ్యం కాకపోతే సంపద పంపిణీ సాధ్యం కాదు.

### రూ.వంద లక్షల కోట్లతో మౌలిక వసతుల కల్పన

సాధించిన అభివృద్ధి ఇక ఎంతమాత్రం సరిపోదు. హైజంప్ చేయాలి. భారత్‌ను ప్రపంచ ప్రమాణాల స్థాయికి తీసుకెళ్లడానికి ఆధునిక మౌలికవసతులు పెంచుకోవాలి. అందుకోసం రాబోయే రోజుల్లో మౌలిక వసతుల కోసం రూ.వంద లక్షల కోట్లు ఖర్చుచేయాలని నిర్ణయించాం. భారతమాల, సాగరమాల ప్రాజెక్టులతో పాటు ఆధునిక బస్, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రపంచస్థాయి విద్యాసంస్థలు, ఆధునిక ఆసుపత్రులు నిర్మిస్తాం.



73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం దిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించిన వేడుకలకు హాజరైన బాలికలను పలకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



రాఖీ పౌర్ణమి సందర్భంగా దిల్లీలో ప్రధానమంత్రి మోదీకి రాఖీ కడుతున్న చిన్నారి

## తప్పాలంటే విలయం దాటాలి వలయం

(మొదటి పేజీ తరువాయి)

తేల్చింది. మొత్తం 121 గ్రామాలలో 2,800 హెక్టార్ల పరిధిలో ఏర్పాటు చేయడానికి అవకాశం ఉందని వివరించింది. మౌలిక సదుపాయాలకు 6,732 కోట్లు అవుతుందని అంచనా వేసింది. ఒక్కో నగరాన్ని ఒక్కో ప్రత్యేక హబ్‌గా తయారు చేసి అక్కడ పరిశ్రమల ఏర్పాటుతోపాటు అన్ని సౌకర్యాలతోకూడిన నివాస ప్రాంతాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. కోకాపేట మినహా మిగిలిన వాటి విషయంలో ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

- హైదరాబాద్ గ్రేటర్‌పరిధి జనాభా దాదాపు కోటి.
- ప్రస్తుతం ఉన్న భవనాల సంఖ్య 20 లక్షలు. అందులో 3.50 లక్షలు మినహా మిగిలినవన్నీ నివాస భవనాలే.
- ఏటా జీహెచ్ఎంసీ 18 వేల భవన నిర్మాణాలకు అనుమతిస్తోంది. మరో నాలుగైదు వేల భవనాల అక్రమ నిర్మాణం జరిగిపోతూనే ఉంది.
- రానున్న రెండు దశాబ్దాల్లో గ్రేటర్‌లో జనాభా 2 కోట్లకు పైబడి పెరిగిపోతుందని అంచనా.
- గ్రేటర్ పరిధిలో వాహనాల సంఖ్య 61 లక్షలు. దీంతో ట్రాఫిక్ నరకయాతన మొదలైంది.

## గ్రంథ రూపంలో స్థానిక వైద్యం

పణజీ: దేశంలోని సంప్రదాయ వైద్య విధానాలను గ్రంథస్థం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పలు ప్రాంతాల్లో అమల్లో ఉన్న స్థానిక ఆరోగ్య పద్ధతులు, వివిధ జాతులు అనుసరించే వైద్య విధానాలు, వైద్యానికి ఉపయోగపడే సహజ వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వనుంది. కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి శ్రీపాద్ నాయక్ ఇక్కడ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ కొన్ని రకాల ఔషధ మొక్కలను మితిమీరి వినియోగిస్తున్నందు వల్ల అవి అంతరించే ప్రమాదంలో పడ్డాయని తెలిపారు. వాటిని భవిష్యత్తు తరాల కోసం అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకోసమే స్థానిక వైద్య విధానాల సంరక్షణపై శ్రద్ధ పెట్టినట్టు చెప్పారు. దిల్లీలోని కేంద్ర ఆయుర్వేద శాస్త్రాల పరిశోధన మండలి మేధోమథనం జరిపిందని తెలిపారు. అధ్యయనంలో భాగంగా 1.5 లక్షల ఔషధ మొక్కలను గుర్తించిందని తెలిపారు. ఒక తరం నుంచి మరో తరానికి వారసత్వంగా వస్తూ, మౌఖిక రూపంలో ఉన్న 10,000 వైద్య విధానాలను సేకరించిందని వివరించారు.

## కుక్కపిల్లలను చెత్తకుండీలో పారేసినందుకు జైలు శిక్ష

- అమెరికాలో న్యాయస్థానం తీర్పు

ఇండియో: మూడు రోజుల వయసున్న ఏడు కుక్కపిల్లలను నిర్దయగా చెత్తకుండీలో పారేసిన మహిళకు అమెరికాలోని ఓ న్యాయస్థానం ఏడాది జైలు శిక్ష విధించింది. దక్షిణ కాలిఫోర్నియాకు చెందిన డెబోరా కల్‌వెల్ అనే మహిళ (59) ఆరు నెలల క్రితం ఏడు కుక్కపిల్లలను ఒక ప్లాస్టిక్ సంచీలో ఉంచి సమీపంలో ఉన్న చెత్త కుండీలో పడేసింది. ఎండ వేడికి అవి మూల్గుతుండగా విన్న స్థానికుడు ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమేరాలో నమోదైన దృశ్యాల ఆధారంగా డెబోరా కల్‌వెల్ వాటిని చెత్తకుండీలో పడేసినట్లు నిర్ధారణ అయింది. కుక్కపిల్లల పట్ల క్రూరంగా వ్యవహరించారని భావించిన కోర్టు ఆమెకు 365రోజుల జైలు శిక్ష విధించింది.

ఈనాడు మహాత్ముడి 1869 - 2019 150వ జయంతి వేడుకలు

### అంతస్సారం ఒక్కటే!

ప్రపంచంలో స్వచ్ఛమైన ఏ మతబోధనల అంతస్సారమైనా చూడండి..
ప్రతి ఒక్కరూ సేవను వరించాలని,
ప్రతి ఒక్కరితో స్నేహంలో తరించాలనే ఉంటుంది!

- మహాత్మా గాంధీ

## ఇంటర్ పరీక్షల వివాదం పెద్ద కుట్ర

- గవర్నర్‌తో సీఎం కేసీఆర్

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో ఇంటర్ పరీక్షలకు సంబంధించిన వివాదం కుట్ర పూరితమని, కొందరు వ్యక్తులు, పార్టీలు ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేసేందుకు ఈ కథను నడిపాయని, చివరికి ఏమీ లేదని తేలిందని ముఖ్యమంత్రి కేసీఆర్ గవర్నర్ నరసింహన్‌తో అన్నారు. న్యాయస్థానం సైతం ఈ అంశంలో స్పష్టమైన తీర్పు ఇచ్చిందని వివరించారు. సున్నితమైన ఇంటర్ పరీక్షల అంశాన్ని రాద్ధాంతం చేయడం, విద్యార్థుల మనోభావాలను దెబ్బతీయడానికి పూనుకోవడం దారుణమని చెప్పారు. కుట్రలను తమ ప్రభుత్వం తిప్పికొడుతుందని అన్నారు. తరతరాలకు ఉపయోగపడేలా సకల వసతులతో కూడిన చక్కటి సచివాలయం నిర్మిస్తామని చెప్పారు. గోదావరి జలాలు, వర్షాలతో తెలంగాణ ఈ సీజన్‌లో సస్యశ్యామలంగా మారుతుందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గవర్నర్ రాజ్‌భవన్‌లో గురువారం సాయంత్రం తేనీటివిందు ఇచ్చారు. దీనికి హాజరైన కేసీఆర్ గవర్నర్‌తో పలు అంశాలపై చర్చించారు. ఇంటర్ పరీక్షల అంశం గురించి నిజానిజాలు తెలుసుకోకుండా కొన్ని పార్టీలు రాజకీయం చేశాయని పేర్కొన్నట్లు తెలిసింది. 'పరీక్షలకు సంబంధించి కనీస అవగాహన లేకుండా మాట్లాడారు. కొన్ని మాధ్యమాల ద్వారా దుష్ప్రచారానికి పూనుకున్నారు. వివాదం తలెత్తగానే ప్రభుత్వం స్పందించి నివారణ చర్యలు తీసుకుంది. తమ లక్ష్యం నెరవేరలేదనే కారణంతో కొన్ని పార్టీలు ఇంకా ఈ అంశాన్ని వదలడం లేదు' అని సీఎం వివరించినట్లు తెలిసింది. రాష్ట్రపతికి పూర్తి వాస్తవాలను వివరిస్తూ నివేదిక అందిస్తామని తెలిపారు. 'తెలంగాణలో ప్రస్తుత సచివాలయంలో అనేక సమస్యలున్నాయి. అన్ని సమస్యలను పరిగణనలోనికి తీసుకొని ఇక్కడ కొత్త సచివాలయం నిర్మించాలని నిర్ణయించాం. బీఆర్కే భవన్‌ను తాత్కాలిక సచివాలయంగా ఎంపిక చేశాం. తరలింపు పనులు సాగుతున్నాయి. కొత్త పంచాయతీరాజ్, పురపాలక చట్టాలు ఆమోదం పొందాయి. త్వరలోనే రెవెన్యూ చట్టం తెస్తాం. సుపరిపాలన, రాష్ట్రాభివృద్ధి కోసం 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాం. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడడం వల్ల ప్రాజెక్టులన్నీ కళకళలాడుతున్నాయి. ఖరీఫ్‌కు ఢోకా లేదు' అని కేసీఆర్ వివరించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఇతర అంశాల గురించి సీఎం గవర్నర్‌తో చర్చించారు.





రాజ్‌భవన్‌లో గురువారం నిర్వహించిన ఎట్ హోంలో గవర్నర్‌తో ముచ్చటిస్తున్న సీఎం కేసీఆర్

కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### తేనీటి విందులో నేతల పలకరింపులు

తేనీటి విందుకు శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి, మంత్రులు శ్రీనివాసగౌడ్, జగదీశ్‌రెడ్డి, మాజీ గవర్నర్ రోశయ్య, తెరాస పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, ఎంపీలు సుబ్బరామిరెడ్డి, సంతోష్‌కుమార్, బండా ప్రకాశ్, రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, షబ్బీర్ అలీతో పాటు వివిధ పార్టీల ముఖ్య నేతలు, సీఎస్ ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ రాజ్‌భవన్ ప్రాంగణంలోని వేదిక వద్దకు వచ్చి రోశయ్య, విపక్ష పార్టీల నేతలను పలకరించారు.

### గవర్నర్, రేవంత్, షబ్బీర్‌ల ఆసక్తికర సంభాషణ

గవర్నర్ దంపతులు విందుకు వచ్చిన వారందరినీ పేరుపేరునా పలకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డితో ఆసక్తికరమైన సంభాషణ చోటు చేసుకుంది. "రేవంత్ వచ్చావా? రాలేదేమోనని.. నీ కోసమే ఎదురుచూస్తున్నా!' అని గవర్నర్ అన్నారు. "మీరు ఆహ్వానించాక రాకుండా ఉంటానా?" అని రేవంత్ బదులిచ్చారు. "ఇంతకుముందు నన్ను కలవడానికి వస్తానన్నారుగా. ఎందుకు రాలేదు" అన్న గవర్నర్ ప్రశ్నకు రేవంత్ స్పందిస్తూ 'కొడతారేమోనని రాలేదు' అనగానే నవ్వుల విరిశాయి. దీనిపై గవర్నర్ మాట్లాడుతూ, 'గతంలో శాసనసభలో నేను కొట్టానా? మీరు నన్ను కొట్టారా?' అని ప్రశ్నించారు. 'అది మనసులో పెట్టుకుని ఎక్కడ కొడతారోననే రాలేదు' అని రేవంత్ చమత్కరించడంతో అక్కడున్న వారంతా పెద్దగా నవ్వారు. తర్వాత షబ్బీర్ అలీని గవర్నర్ పలకరించారు. 'నాపై కోపంగా ఉన్నట్టున్నారే?' అన్నారు. పక్కనే ఉన్న రేవంత్ వెంటనే కల్పించుకుని 'మా షబ్బీర్ అన్న బిర్యానీ పెడతాడు తప్ప ఎవరినీ కోపగించుకోడు' అనడంతో వెంటనే గవర్నర్ సతీమణి స్పందించారు. 'ఆయన బిర్యానీ తినరు కదా' అనడంతో మరోమారు నవ్వులు విరిశాయి.

### ముగిసిన అమర్‌నాథ్ యాత్ర

శ్రీనగర్: దక్షిణ కశ్మీర్‌లోని అమర్‌నాథ్ గుహలో సహజంగా వెలిసే మంచు శివలింగాన్ని దర్శించుకునే పవిత్ర అమర్‌నాథ్ యాత్ర ముగిసింది. మొత్తం 3.39 లక్షల మంది భక్తులు ఈసారి యాత్రకు వెళ్లారు. గురువారం శ్రావణపౌర్ణమి సందర్భంగా 'ఛడీ ముబారక్' రాకతో యాత్ర ముగిసింది. 46రోజులు సాగాల్సిన ఈ యాత్ర జులై 1న మొదలై 31న 'అననుకూల వాతావరణం' కారణంగా ఆగింది. 3 రోజుల తర్వాత పాక్‌కు చెందిన ఉగ్రవాదులు యాత్రపై దాడికి కుట్రపన్నినట్లు తెలిపిన సైన్యం.. యాత్రికులను వెంటనే తిరిగి వెళ్లిపోవాలని చెప్పింది. ఆ తర్వాత యాత్రపునఃప్రారంభం కాలేదు.


గురుకుల టీచర్స్ DSC TET TS AP Paper- I&II TM EM
TGT/PGT/PET/ LIBRARIANS
S.I/కానిస్టేబుల్స్, RRB TM EM
GROUPS - I,II,III & IV
హాస్టల్ వసతి కలదు
FREE DEMO: 18-08-2019 at 10.08 am
RAMAIAH COMPETITIVE COACHING CENTRE Opp: Konark Theatre Dilsukhnagar, Hyd Cell :8885555202 9246208422

New Batch Starts on : 17th Aug. for
JLM | ECET
Junior Linemen(SPDCL) & Diploma Subjects
SUB-ENGG.
SAIMEDHA
Koti, Hyd. 9246212138

గురుకుల్ టీచర్స్ TET TS/AP EM/TM PAPER-I, II
TGT/PGT/PET..etc TET+DSC-SGT
TET క్వాలిఫై & గురుకుల ఉద్యోగం సాధించడం ఎలా?
FREE DEMO : 18-8-2019@10AM
Gurukul Paper-II & III స్పెషల్ బ్యాచ్‌లు @MONDAY
GROUPS-II, III, IV & VRO పంచాయతీ సెక్రటరీ
బాసర ఇన్‌స్టిట్యూట్ 8686344155 7674883883


### గ్రహం అనుగ్రహం

16-8-2019 శుక్రవారం

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
పాడ్యమి: సా.6-10 తదుపరి విదియ
ధనిష్ఠ నక్షత్రం: ఉ.10-12 తదుపరి శతభిష
అమృత ఘడియలు: తె.4-37 నుంచి 6-33 వరకు
వర్జ్యం: సా.6-09 నుంచి 7-55 వరకు
దుర్ముహూర్తం: ఉ.8-17 నుంచి 9-07 వరకు
తిరిగి మ.12-29 నుంచి 1-20 వరకు
రాహుకాలం: ఉ.10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5-46; సూర్యాస్తమయం: సా.6.23

### వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| సూర్యాపేట | 35.0 | 27.0 |
| హన్మకొండ | 34.6 | 27.1 |
| ఖమ్మం | 34.0 | 28.0 |
| నల్గొండ | 34.0 | 23.6 |
| రామగుండం | 33.8 | 24.4 |
| హైదరాబాద్ | 32.6 | 24.2 |
| మహబూబ్‌నగర్ | 32.0 | 24.5 |
| కరీంనగర్ | 32.0 | 24.0 |
| ఆదిలాబాద్ | 31.3 | 24.2 |
| నిజామాబాద్ | 30.2 | 23.4 |
| మెదక్ | 26.7 | 22.0 |

సందర్భం

# ఎవరో ఆ బాండ్?


ప్రఖ్యాత వేలంశాల సోత్‌బీ ఒక కారుని వేలం వేస్తోంది. ఇందులో ఉన్న ప్రత్యేకతలు మామూలువి కావు.

- సీటు ఎజెక్టర్ బటన్‌ని నొక్కితే టాప్ పక్కకి జరిగి డ్రైవరు గాల్లోకి లేస్తాడు.
- టైర్లలో నుంచి కత్తులు దూసుకొస్తాయి.
- వెనక టెయిల్‌ల్యాంప్ నుంచి మెషిన్‌గన్ బయటికొచ్చి ధన్‌ధన్‌మని గుళ్ల వర్షం కురిపిస్తుంది.
- ముందు, వెనకా బంపర్ల నుంచి కొక్కేలు బయటికొస్తాయి.
- సెంటర్ కన్‌సోల్‌లో వీటన్నింటినీ నియంత్రించే మీటలుంటాయి.
- ఇది గంటకు 233 కి.మీ.ల వేగంతో ప్రయాణిస్తుంది.



- 3,995సీసీ, 6 సిలిండర్ ఇంజిన్, 282హెచ్‌పీ సామర్థ్యం 390 ఎన్‌ఎం టార్క్ దీని సొంతం.

మీకీపాటికే అర్థమైపోయిందనుకుంటా. ఇది బాండ్.. జేమ్స్ బాండ్ కారని. 'గోల్డ్ ఫింగర్' సినిమాలో ఉపయోగించిన ఈ రెండు సీట్ల కూపె త్వరలో వేలంపాటలో ఒక ప్రైవేటు వ్యక్తి సొంతం కాబోతోంది.



కావొద్దు..

# స్టీరాంగ్!

**కారుని మలుపు తిప్పాలంటే స్టీరింగ్ సరిగా ఉండాలి...**
**జీవితం చెడు మలుపు తిరగొద్దంటే పట్టుకునే స్టీరింగ్ పొజిషన్ బాగుండాలి...**
**ఏ సమయంలో ఎలాంటి పొజిషన్ తీసుకోవాలి? ఏ ప్రయాణానికి ఎలాంటి భంగిమ ఎంచుకోవాలి?**
**స్టీరింగ్ లోపాలతో కలిగే అనర్థాలేంటి? తలెత్తే అనారోగ్య సమస్యలకు ఎలా చెక్ పెట్టాలి?**
**ఈ సందేహాలన్నీ నిపుణుల ముందుంచాం. వారిచ్చిన సలహాలు ఆచరిస్తూ మన వాహన చక్రాలను గమ్యం వైపు సాఫీగా సాగిపోనిద్దాం.**

చేతిలో స్టీరింగ్.. ఒంట్లో ఉత్సాహం ఉంటే హ్యాచ్‌బాక్ నుంచి హై-ఎండ్ కారు ఏదైనా అరవై మైళ్ల వేగంతో దూసుకెళ్లిపోవచ్చు. కానీ స్టీరింగ్ తిప్పడంలో ఏమాత్రం తేడాలొచ్చినా జీవితం తలకిందులవుతుంది.

నిజానికి స్టీరింగ్ చక్రం ఇలాగే పట్టుకోవాలనే కచ్చితమైన నిబంధనేం లేదు. సౌకర్యం, డ్రైవింగ్ చేసే అలవాటు ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా అత్యధికులు మూడు పొజిషన్లు ఎంచుకుంటారని తేలింది. స్టీరింగ్ చక్రాన్ని గోడ గడియారంలా భావిస్తే పైన 12, కింద 6, ఎడమ వైపు 9, కుడి చేయి 3 అవుతుంది. ఎక్కువమంది 9-3, 8-4, 10-2 భంగిమలు ఎంచుకుంటున్నారు. వీటిని సమర్థంగా, ఏ సమయాల్లో ఎంచుకోవాలో తెలుసుకుందాం.

### ఇవీ పాటించాలి

- ఒకే చేత్తో స్టీరింగ్ పట్టుకోవద్దు. కారు వేగంలో ఉన్నప్పుడు నియంత్రించడం చాలా కష్టం.
- కొందరు స్టీరింగ్ పట్టుకొని బొటనవేళ్లని పైకి ఆడిస్తుంటారు. అకస్మాత్తుగా రోడ్డుపై ఏదైనా అడ్డొస్తే నియంత్రించలేం.
- ఎక్కువ మలుపులు, యూటర్న్‌లు తీసుకుంటున్నప్పుడు ఒక చేయి పైన ఉంటే, ఇంకోటి కింద.. ఉండే పొజిషన్‌లో ఎంచుకోవాలి. ఒంటి చేత్తో స్టీరింగ్ తిప్పే ప్రయత్నం చేయొద్దు.
- పెద్దపెద్ద మలుపులు, యూటర్న్‌లు తీసుకున్న వెంటనే 9-3 పొజిషన్‌కి రావాలి.
- స్టీరింగ్ వీల్ రిమ్ కింద చేతులు పెట్టొద్దు. ఇలా చేస్తే వాహనం అదుపులో ఉండకపోవడమే కాదు.. ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకున్నప్పుడు చేతులకు తీవ్ర గాయాలపాలవుతాయి.
- లోపల కూర్చునేముందే సీటుని అడ్జెస్ట్ చేసుకోవాలి. విండ్‌షీల్డ్ అద్దాల నుంచి చూస్తే కారు, రోడ్డు మధ్య మీటరు దూరమైనా స్పష్టంగా కనిపించగలగాలి.
- అరచేతులు పైకి కనిపించేలా స్టీరింగ్ వీల్ లోపల చేతులు పెట్టి హుకింగ్ చేస్తుంటారు కొందరు ఇది ప్రమాదకరం.
- స్టీరింగ్, సీటుకి మధ్య పది అంగుళాల దూరమైనా ఉండాలి. లేకపోతే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఎయిర్‌బ్యాగ్ అత్యంత వేగంతో విచ్చుకున్నప్పుడు ఛాతిపై విపరీతమైన ఒత్తిడి పడి ఒక్కోసారి మరణమూ సంభవించవచ్చు.
- 7, 5 పొజిషన్‌లో ఉన్నప్పుడు అకస్మాత్తుగా స్టీరింగ్ తిప్పడం సాధ్యం కాదు. దీన్ని ఆచరించడం తగదు.
- గేర్ నాబ్, ఇతర కంట్రోల్ బటన్లు నొక్కాల్సి వచ్చినప్పుడు వాహనం వేగం కాస్త తగ్గించాలి. ఒక చేత్తో మంచి గ్రిప్ ఉండేలా స్టీరింగ్ పట్టుకోవాలి.
- స్టీరింగ్ ఒంటి చేత్తోనే పట్టుకోవాల్సిన సందర్భం వచ్చినప్పుడు తప్పనిసరిగా 9, 3 పొజిషన్‌లో ఉంచాలి.

### ట్రాఫిక్‌లో ఉన్నప్పుడు 10-2



ట్రాఫిక్‌లో ఉన్నప్పుడు, రోడ్డుమీద అవాంతరాలు ఎక్కువైనప్పుడు ఈ పొజిషన్ ఎంచుకుంటే మేలు. చక్రాన్ని ఎక్కువసార్లు అటూఇటూ తిప్పడానికి అనువుగా ఉంటుంది. చిన్నకార్లలో క్యాబిన్ ఇరుకుగా ఉంటుంది. వేరే పొజిషన్లు ఎంచుకుంటే మోచేతులు డోర్లకి, అద్దాలకి తగిలే అవకాశం ఉంటుంది. అందుకే హ్యాచ్‌బాక్ డ్రైవింగ్‌కి ఈ భంగిమ అనుకూలం. ఎత్తు, పొడవు చేతులున్న వారికి సైతం ఇదే నప్పుతుంది. ఎయిర్‌బ్యాగ్‌లున్న కారులో మాత్రం ఈ స్థితి ఎంచుకోవద్దని చెబుతారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఎయిర్‌బ్యాగ్ తెరుచుకుంటే ఛాతి, చేతులు, ముఖంపై తీవ్రమైన ఒత్తిడి పడి గాయాలపాలవుతారు.

### అందరి ఎంపిక 9-3



కారు డ్రైవింగ్ శిక్షకులు, ఆటోమొబైల్ నిపుణుల్లో అత్యధికుల ఓటు దీనికే. దీన్ని సహజసిద్ధమైన, సౌకర్యవంతమైన పొజిషన్‌గా భావిస్తారు. సెడాన్, ఎస్‌యూవీ, లగ్జరీ కార్ల స్టీరింగ్ చక్రం డయామీటర్ (చుట్టుకొలత) సహజంగానే చిన్నగా ఉండటంతో ఈ పొజిషన్ అనుకూలంగా ఉంటుంది. స్టీరింగ్ వీల్‌లో ఉండే కంట్రోల్ మీటలను మణికట్టు సాయంతో తేలికగా నియంత్రించవచ్చు. ఈ భంగిమలో రెండు చేతుల మధ్య దూరం సమానంగా ఉండటంతో బ్యాలెన్స్‌డ్‌గానూ ఉంటుంది. తక్కువ దూరాల నుంచి లాంగ్‌టూర్లకు వెళ్లే డ్రైవర్లు దీన్ని ఎంచుకోవచ్చు.

### దూరప్రయాణాలకు 8-4



జాతీయ రహదారుల్లో, అత్యధిక దూరం ప్రయాణిస్తున్నప్పుడు సాధారణంగా స్టీరింగ్‌ని ఎక్కువగా అటూఇటూ తిప్పాల్సిన అవసరం ఉండదు. అలాంటి సందర్భాల్లో ఈ పొజిషన్ ఎంచుకుంటే మేలు అంటారు నిపుణులు. అప్పుడు మోచేయి, భుజం 90 డిగ్రీల కోణంలో ఉండాలి. ఇది కాకుండా వేరే భంగిమ ఎంచుకొని గంటలకొద్దీ ప్రయాణం చేస్తే భుజాలు, మెడ కండరాల్లో తీవ్రమైన నొప్పి వస్తుంది. అలసట, ఒంట్లో సత్తువ తగ్గి స్టీరింగ్‌పై నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంది. ఐఐటీ-మద్రాసు నిపుణులు తరచూ దూరప్రయాణాలు చేసే కొంతమందిపై సర్వే చేయగా 8-4 కాకుండా ఇతర భంగిమలు ఎంచుకున్నవారు వెన్నునొప్పి సమస్యలు, కండరాల సమస్యల బారిన పడ్డట్టు గుర్తించారు.

### అతి ఆత్మవిశ్వాసం వద్దు

మనం నడిపే కారు, ప్రయాణించే సందర్భానికి అనుగుణంగా స్టీరింగ్ పట్టుకునే విధానం మార్చుతుండాలి. డ్రైవింగ్ నేర్చుకునే వాళ్లకి మేం ఎక్కువగా 9-3 పొజిషన్ ఎంచుకొమ్మని చెబుతాం. అతి ఆత్మవిశ్వాసంతో కొందరు స్టీరింగ్ కింద, పైన, పక్కలా పట్టుకుంటారు. ఒక్క చేతినే ఉపయోగిస్తారు. ఈ నిర్లక్ష్యం ఒక్కోసారి పెను ప్రమాదాలకు దారి తీస్తుంది. హైవేలపై వెళ్తున్నప్పుడు స్టీరింగ్‌ని కుదురుగా పట్టుకొని ఉంచినా ఎటైనా ఒక పక్కకే లాగేస్తుంటుంది. అలా జరగకుండా ఉండాలంటే కొద్దిగా ఎడమ, కుడిలకు టర్న్ చేస్తుండాలి. స్టీరింగ్‌పై పూర్తి పట్టు లేనివాళ్లు తక్కువ వేగంతో వెళ్లడమే మంచి పరిష్కారం.



**- దుర్గాకుమారి,**
హ్యుందాయ్ మోటార్స్ డ్రైవింగ్ స్కూల్

మెకానిక్‌గురూ

# 200 కేజీలు మించితే భారమే

■ **నాకు 2013 మోడల్ హోండా యాక్టివా ఉంది. ఈమధ్యే రెండూ కొత్త టైర్లు వేయించాను. ఇవి మార్చిన తర్వాత బండిపై ఇద్దరం, ముగ్గురం వెళ్తున్నప్పుడు స్కూటీ వణుకుతోంది. టైర్లు, వీల్ అలైన్‌మెంట్ మరోసారి చెక్ చేయించాను. అంతా బాగానే ఉందంటున్నారు. మరెందుకీ సమస్య? - రోహిత్ కోసూరి**



సాధారణంగా 150 నుంచి 200 కిలోల బరువు భరించగలిగేలా స్కూటీని తయారు చేస్తారు. అంతకుమించి భారం మోపితే ప్రమాదకరం. ఇదికాకుండా ట్రిబుల్ రైడింగ్ చట్టవిరుద్ధం. చక్రం వణుకుతోంది అంటే వీల్ రిమ్ మీద టైరు పొందిగ్గా కూర్చుందో, లేదో ఒక్కసారి చెక్ చేయించండి. ఇందులో తేడా వచ్చినప్పుడు ఇది ఒకేవైపు లాగుతుంది. దీంతోపాటు టైరులో గాలి తగినంత ఉందా? లేదా? పరిశీలించండి.

■ **నా ఎత్తు 6.5 అడుగులు. నాకు తగ్గట్టుగా పాత హీరో కరిజ్మా ఆర్, కరిజ్మా జెడ్‌ఎంఆర్ రెండింట్లో ఏదైనా బైక్ తీసుకోవాలనుకుంటున్నాను. ఫర్వాలేదా? మీరింకేదైనా సూచిస్తారా? - అనిల్‌కుమార్**

ఎత్తుగా ఉండే రైడర్ల కోసం హీరో కరిజ్మా మోడల్‌ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం దీని ఉత్పత్తి ఆపేశారు. పాత విడిభాగాలు దొరకడం కష్టం. వీటి స్థానంలో ఎక్స్‌ట్రీమ్, ఎక్స్‌పల్స్ మోడళ్లు తీసుకొచ్చారు. ఎక్స్‌పల్స్ 200 ఆఫ్‌రోడ్ బైక్. ఎత్తు 823 ఎంఎం. మీకు చక్కగా సరిపోతుంది. స్పోర్టియర్ లుక్, మంచి సామర్థ్యం ఉన్న బండి కావాలనుకుంటే ఎక్స్‌ట్రీమ్ 200ఎస్ ప్రయత్నించవచ్చు. మేటి డిజైన్, స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ, ఇతర ఫీచర్లున్నాయి. హీరో కాకుండా బజాజ్ పల్సర్ 220 కూడా మీ అవసరాలకు సరిపోతుంది.

■ **సర్, నేను సెకండ్‌హ్యాండ్ వాహనం కొనాలనుకుంటున్నాను. రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి యజమాని నుంచి ఏమేం డాక్యుమెంట్లు తీసుకోవాలో తెలియజేయగలరు. ఈ ప్రాసెస్ ఎలా ఉంటుంది? - విజయ్ రవి**

ఒరిజినల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బీమా, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పకుండా తీసుకోవాలి. వాహనం కొన్న వెంటనే మీ పేరున మార్పించుకోవాలి. ట్రాన్స్‌ఫర్ వెహికిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (టీవీఆర్‌సీ) కావాలంటే ముందు చెప్పినవన్నీ ఉండటం తప్పనిసరి. తర్వాత ఫామ్ 28, 29, 30 పూర్తిచేసి రవాణాశాఖకు సమర్పించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు తెలంగాణ రవాణాశాఖ వెబ్‌సైట్ చూడండి.

**- హర్షిన్ లాల్‌పేట్,** ఆటోమొబైల్ నిపుణుడు

(మీకూ ఇలాంటి సందేహాలు, సమస్యలుంటే రాసి పంపండి)

చిట్కా

# బొగ్గుతో దుర్వాసన మాయం



కారులో దుర్వాసన వస్తుంటే ప్రయాణం నరకప్రాయంగా ఉంటుంది. ఇంక ఏదైనా ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోతే ఆ బాధలు వర్ణనాతీతం. అద్దాల్ని కిందికి దించుకోవడం ఒక పరిష్కారమైనా అదే సమయంలో వర్షం పడితే.. బయట చాలా చలిగా ఉంటే దాన్నీ భరించలేం. ఈ సమస్యను అప్పటికప్పుడే పరిష్కరించే తేలికైన చిట్కా ఒకటుంది. కొన్ని బొగ్గు ముక్కలు తీసుకొని చిన్న గుడ్డ సంచీలో వేసి ఎక్కడైనా తగిలించాలి. అది కొద్ది సమయంలోనే చెడు వాసనల్ని పీల్చేసుకుంటుంది. కొన్ని గంటలైన తర్వాత వేరే బొగ్గుల సంచీ తీసుకోవాలి. ఇలా చేస్తూ పోతుంటే దుర్వాసన మటుమాయవుతుంది. కార్బన్ ఎయిర్‌ఫిల్టర్లు ఇదే సూత్రం ఆధారంగా పని చేస్తాయి.

విడుదల

# మెరుపులా బుల్లెట్

మంచి పికప్, సౌకర్యవంతమైన డిజైన్‌తోపాటు రాజసం ఉట్టిపడే టూవీలర్ కావాలనుకునేవారి ఎంపిక రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్. 1932 నుంచి ఘనమైన వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ బైకర్ల మనసు దోచుకుంటూనే ఉంది. ఈసారి బుల్లెట్ ఎక్స్, బుల్లెట్ ఈఎస్-ఎక్స్ అనే మోడళ్లతో మరింత మెరుగై మార్కెట్లోకి వచ్చేసింది. డిజైన్, ఇంజిన్ పవర్, టార్క్‌ల్లో ఎలాంటి మార్పూ లేదు. మిగతా విషయాలకొస్తే..

**కొత్త పెయింట్ స్కీమ్:** కలర్, గ్రాఫిక్ పూర్తిగా మారాయి. ఎక్స్ మోడల్ బ్లూ, సిల్వర్, బ్లాక్.. మూడు రంగుల్లో లభ్యమవుతోంది. ఈఎస్-ఎక్స్‌లో రెడ్, బ్లూ, బ్లాక్ రంగులున్నాయి. గ్లాసీ బ్లాక్ మెరుపులు మరింత ఆకర్షణీయంగా ఉన్నాయి. ఇంజిన్ పార్ట్స్‌కి నలుపు రంగులద్దారు. రిబ్బ్‌డ్ ప్యాటర్న్ సీటు పాతదే.



**ఏబీఎస్:** రెండు మోడళ్లకీ సింగిల్ ఛానెల్ యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్) ఫీచర్ జోడించారు. టెక్నికల్‌గా ఇదే చెప్పుకోదగ్గ మార్పు.

**నిర్వహణ వ్యయం సగమే:** కొత్త మోడళ్లతో నిర్వహణ ఛార్జీలు నలభైశాతం తగ్గుతాయంటోంది రాయల్ ఎన్‌ఫీల్డ్. ప్రతి మూడు నెలలు లేదా మూడు వేల కిలోమీటర్లకోసారి ఉండే సర్వీసింగ్ పీరియడ్‌ని ప్రతి ఆరు నెలలు లేదా ఐదువేల కిలోమీటర్లకు సవరించారు. మినరల్ ఆయిల్ నుంచి సెమీ సింథటిక్ ఆయిల్‌కి ఇంజిన్‌ని మార్చారు. ఆయిల్ ఛేంజ్ గతంలో ఆరు నెలలు లేదా ఐదువేల కిలోమీటర్లు ఉండేది. దీన్ని పన్నెండు నెలలు లేదా పదివేల కిలోమీటర్లకు మార్చారు.

**ధర తక్కువ:** ఇన్ని అప్‌డేట్స్ చేసినా రెండు మోడళ్లపై ధర రూ.తొమ్మిదివేల వరకు తగ్గించడం విశేషం.

**అదనపు సేవలు:** ఏడాదిపాటు ఉచిత సర్వీసింగ్, 24x7 రోడ్‌సైడ్ సాయం అందిస్తున్నారు.

- కొత్త మోడళ్లు మార్కెట్లోకి వచ్చినా క్లాసిక్ బుల్లెట్ మోడల్‌ని కొనసాగిస్తున్నారు.

**- డీనోస్ వాల్ట్,** ఆటోమొబైల్ బ్లాగర్

# డీజిల్‌తో కిక్స్

**కిక్ ఇచ్చే పనితీరుతో రోడ్లపై ఇప్పటికే పరుగులు పెడుతున్న నిస్సాన్ కిక్స్ తాజాగా డీజిల్ వేరియంట్‌లో అందుబాటులోకి వచ్చింది. ఎస్‌యూవీ విభాగంలో, పదకొండు రంగుల్లో.. ఎక్స్‌ఎల్, ఎక్స్‌వీ, ఎక్స్‌వీ ప్రీమియం అనే రకాల్లో లభ్యమవుతోంది.**

**డిజైన్:** ప్రీమియం కారులా విశాలమైన ఇంటీరియర్, స్టైలిష్ ఎక్స్‌టీరియర్‌తో మలిచారు.

**ఫీచర్లు:** ఆటో ఏసీ వెంట్, రెండు ఎయిర్‌బ్యాగ్‌లు, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, ఈబీడీ, బ్రేక్ అసిస్ట్, యూఎస్‌బీ, బ్లూటూత్ కనెక్టివిటీ, షార్క్ ఫిన్ యాంటెన్నా, సెంట్రల్ డోర్ లాక్, స్పీడ్ సెన్సింగ్ ఆటో డోర్‌లాక్, రేయర్ పార్కింగ్ సెన్సర్లు.. ఈ ఎస్‌యూవీలో చెప్పుకోదగ్గ ఫీచర్లు.

**ఇంజిన్:** 1.5 లీటర్ల కే9కే డీసీఐ డీజిల్ ఇంజిన్ 110 పీఎస్‌ని ఉత్పత్తి చేస్తుంది.

**నిస్సాన్ కనెక్ట్:** కారుని నిస్సాన్ కనెక్ట్ యాప్‌తో అనుసంధానం చేయొచ్చు. జియో ఫెన్సింగ్, స్పీడ్ అలర్ట్, లొకేట్ మై కార్, కీ లెస్ ఎంట్రీ.. ఇలా యాభై రకాల సేవలు అందిస్తుంది.

**మైలేజీ:** 20.45కి.మీ./లీటరు

**సర్వీస్:** ఐదేళ్ల ఉచిత వారంటీ సర్వీసు, 24x7 రోడ్‌సైడ్ అసిస్టెన్స్ అందిస్తున్నారు.

**ధర: రూ. 9.89 లక్షలు**



# ఈనాడు సినిమా



'అల వైకుంఠపురములో'లో అల్లు అర్జున్



'సైరా నరసింహారెడ్డి'లో చిరంజీవి

## గ్యాప్ ఇవ్వలా... వచ్చింది

అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయిక. టబు కీలక పాత్రధారి. ఈ చిత్రానికి 'అల వైకుంఠపురములో' అనే పేరు ఖరారు చేశారు. గురువారం టీజర్‌ని విడుదల చేశారు. 'ఏంట్రోయ్ గ్యాప్ ఇచ్చావ్' అని మురళీ శర్మ అడిగితే 'ఇవ్వలా... వచ్చింది' అంటూ అల్లు అర్జున్ చెప్పే డైలాగ్‌ని ఈ టీజర్‌లో వినిపించారు. తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో సాగే చిత్రమిది. నాయిక పేరు అలకనంద. వైకుంఠపురం నేపథ్యంలో సాగుతుంది. అందుకే 'అల వైకుంఠపురములో' అనే పేరు నిర్ణయించినట్టు తెలుస్తోంది. అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ నిర్మాతలు. తమన్ సంగీతం అందిస్తున్నారు. రాజేంద్రప్రసాద్, సచిన్ ఖేడ్కర్, సముద్రఖని, జయరాం, సునీల్, నివేదా పేతురాజ్, బ్రహ్మాజీ, హర్షవర్ధన్, రాహుల్ రామకృష్ణ తదితరులు నటిస్తున్నారు. సంక్రాంతికి విడుదల చేస్తారు.



సాయిధరమ్ తేజ్



దేవ కట్టా

## దేవ కట్టా దర్శకత్వంలో తేజూ

'ప్రస్థానం'తో ఆకట్టుకున్న దర్శకుడు దేవ కట్టా. ప్రస్తుతం అదే చిత్రాన్ని సంజయ్‌దత్‌తో హిందీలో రీమేక్ చేస్తున్నారు. ఆ తరవాత తెలుగులో ఓ సినిమా తెరకెక్కించడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. ఈసారి ఆయన సాయిధరమ్ తేజ్‌తో జట్టు కట్టనున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రానికి భగవాన్, పుల్లారావు నిర్మాతలుగా వ్యవహరిస్తారు. ప్రస్తుతం మారుతి తెరకెక్కిస్తున్న 'ప్రతిరోజూ పండగే'లో నటిస్తున్నారు తేజు. ఈ సినిమా పూర్తయిన వెంటనే దేవ కట్టా సినిమా మొదలవుతుందని తెలుస్తోంది.



'సరిలేరు నీకెవ్వరు'లో మహేష్‌బాబు

## నిప్పుల వర్షమొచ్చినా.. జనగణమన అంటూనే

మన కథానాయకులు వీలైనప్పుడల్లా ఏదో ఓ రూపంలో తమ దేశభక్తిని చూపిస్తూనే ఉంటారు. వెండి తెరపై సైనికుల పాత్రలు ధరించాల్సి వచ్చినప్పుడు ఆ తపన మరింతగా పెరిగిపోతుంది. మహేష్‌బాబు నటిస్తున్న 'సరిలేరు నీకెవ్వరు'లోనూ దేశభక్తి నేపథ్యం ఉంది. ఈ చిత్రంలో మహేష్ సైనికాధికారిగా కనిపించనున్నారు. ఆగస్టు 15 సందర్భంగా చిత్రబృందం ఓ ప్రత్యేక వీడియోని విడుదల చేసింది. అందులో బ్యాక్‌గ్రౌండ్‌లో వచ్చే 'భగభగభగ మండే నిప్పుల వర్షమొచ్చినా, జనగణమన అంటూనే దూకేవాడే సైనికుడు, పెళపెళపెళ మంటూ మంచు తుపాను వచ్చినా, వెనకడుగే లేదంటూ దాటేవాడే సైనికుడు' అనే గీతం ఆకట్టుకుంటోంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. రామబ్రహ్మం సుంకర నిర్మాత. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. వచ్చే సంక్రాంతికి విడుదల చేస్తారు. రష్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో విజయశాంతి కీలక పాత్ర పోషిస్తున్నారు. సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

### పంచ్ డైలాగ్

**చనిపోయేటప్పుడు నలుగురు లేకపోతే నా తప్పు అవుతుంది. కానీ పుట్టేటప్పుడు లేక పోతే అది నా తప్పు ఎలా అవుతుంది సర్**

చిత్రం: పోలో

– పంపిన వారు: డి.రఘునాథ్‌రెడ్డి, రాజోలు

మెయిల్ ఐడీ: cinema@eenadu.net



రకుల్‌ప్రీత్ సింగ్

### గీతోపదేశం

**గురువింద ఈ సమాజం**
**పరనింద దాని నైజం**
**తన కింద నలుపు తత్వం**
**కనిపెట్టలేదు సహజం**

గీతం: నువ్వేమి చేశావు నేరం...
చిత్రం: పెళ్లి చేసుకుందాం
రచన: సిరివెన్నెల సీతారామశాస్త్రి

– పంపినవారు: ఆరుద్ర శ్రీవిద్య, ముల్కలపల్లి

## ఒక్క మాట కోసం పదిసార్లు ఆలోచిస్తా!

"ఓ విషయాన్ని ఎవరు చెబుతున్నారు? ఏ మాధ్యమం ద్వారా చెబుతున్నారు? అనేది చాలా ముఖ్యం. మా కళాకారులకు సినిమా కంటే గొప్ప మాధ్యమం లేదు. ఏం చెప్పాలనుకున్నా, సినిమానే సాధనంగా వాడుకోవాలి" అంటోంది రకుల్‌ప్రీత్ సింగ్. ఈమధ్యే 'మన్మథుడు 2'తో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది. ప్రస్తుతం 'ఇండియన్ 2'లో ఓ కీలక పాత్ర పోషిస్తోంది. రకుల్ మాట్లాడుతూ "మేం ఏ విషయం చెప్పినా జనాలకు క్షణాల్లో చేరిపోతుంది. అలాంటప్పుడు ప్రతి మాటనీ ఆచి తూచి వాడాలి. సినిమాల ద్వారా ఎంచుకునే కథలు, పాత్రలు కూడా ప్రభావితం చేస్తుంటాయి. ఓ మంచి మాట చెప్పాలి, సందేశం ఇవ్వాలి అనుకున్నప్పుడు సినిమానే అత్యుత్తమ మార్గం. మేం ఎంచుకునే కథల ద్వారానే ప్రేక్షకుల్ని చైతన్యవంతులం చేయొచ్చు. అందుకే తెరపై ఎలాంటి మాట మాట్లాడాలన్నా ఒకటికి పదిసార్లు ఆలోచిస్తా" అని చెప్పింది.



శివగణేష్

## గీత రచయిత శివగణేష్ కన్నుమూత

ప్రముఖ గీత రచయిత శివగణేష్ (63) కన్నుమూశారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో ఆయన గుండెపోటుతో మరణించారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో 1956 ఆగస్టు 10న జన్మించారాయన. ఎక్కువ కాలం చెన్నైలోనే గడిపారు. నాలుగేళ్ల కిందట హైదరాబాద్ వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. ఎమ్మెస్సీలో గోల్డ్‌మెడల్ సాధించిన శివగణేష్ ఏడు భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. తెలుగు, తమిళ భాషల్లో పీహెచ్‌డీ చేశారు. తెలుగు, తమిళ, కన్నడ తదితర భాషల్లో వెయ్యి పాటలకు పైగానే రాశారు. నటుడు శరత్‌బాబుతో స్నేహం ఉండటంతో 'ఆస్తి మూరెడు ఆశ బారెడు' సినిమాలో పాటలను శివగణేష్ రాశారు. ఆ తర్వాత పలు చిత్రాలకు పాటలు రాసే అవకాశాలు వచ్చాయి. ప్రముఖ నిర్మాత ఎ.ఎం.రత్నం చిత్రాలకు ఎక్కువగా పని చేశారు. 'జీన్స్'లో ప్రియా..ప్రియా.. చంపొద్దే, 'ఒకే ఒక్కడు'లో నెల్లూరి నెరజాణ.. '7జి బృందావన్ కాలనీ'లో తలచి తలచి చూసా.. లాంటి పాటలు శివ గణేశ్ కలం నుంచి జాలువారినవే. 'ప్రేమికులరోజు', 'బోయ్స్', 'నరసింహ', 'ఎంతవాడు గానీ', 'ఉల్లాసంగా' 'బ్రహ్మచారి', 'లవర్స్ డే', 'గొరిల్లా' చిత్రాలకు పాటలు రాశారు. సంస్కృతంలో ఈయన రచించిన భక్తి గీతాలు ప్రాచుర్యం పొందాయి. కొన్ని ఆధ్యాత్మిక గీతాల్నీ రాశారు. వాణిజ్య ప్రకటనల జంగిల్స్‌ని రచించారు. శివ గణేష్‌కు భార్య నాగేంద్రమణి, కొడుకులు సుహాస్, మానస్ ఉన్నారు. సుహాస్ గీత రచయిత. గురువారం శివగణేష్ అంత్యక్రియలు పూర్తి చేశారు.

- న్యూస్‌టుడే, వనస్థలిపురం

## నందమూరి నేతాజీ.. అల్లు వారి వీరనారి



అర్హ



అభయ్ రామ్



అయాన్

పంద్రాగస్టు వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. వీధులన్నీ మువ్వన్నెల జెండాలతో మురిశాయి. 'నేటి బాలలే రేపటి పౌరులు' కదా. వాళ్లూ ఈ సంబరాల్లో పాలు పంచుకున్నారు. ఆకట్టుకునే గెటప్పుల్లోకి మారిపోయారు. వాళ్లలో స్టార్ హీరోల వారసులూ ఉన్నారు. ఎన్టీఆర్ కుమారుడు అభయ్ రామ్.. నేతాజీగా మారిపోయాడు. అల్లు అర్జున్ ఇద్దరు పిల్లలు అయాన్, అర్హలు కూడా ముద్దులొలికే వేషధారణతో ఆకట్టుకున్నారు. అర్హ వీరనారి గెటప్పులో, అయాన్ గన్ పట్టుకొని అలరించారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి.



విద్యా సిన్హా

## బాలీవుడ్ నటి విద్యా సిన్హా ఇక లేరు

సీనియర్ బాలీవుడ్ నటి విద్యా సిన్హా(71) కన్నుమూశారు. శ్వాస సంబంధిత సమస్యలతో కొన్ని రోజులుగా ముంబయిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న ఆమె.. గురువారం తుది శ్వాస విడిచారు. రాణా ప్రతాప్ సింగ్ అనే సినీ నిర్మాత కుమార్తె అయిన విద్య మోడల్‌గా కెరీర్ ప్రారంభించారు. తన అందంతో మిస్ బాంబే కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత వెండితెరపై అడుగు పెట్టారు. 'రాజాకాకా'తో బాలీవుడ్‌కు పరిచయమయ్యారు. ప్రముఖ దర్శకుడు బసు ఛటర్జీ తెరకెక్కించిన 'రజనీగంధ', 'ఛోటీ సీ బాత్' చిత్రాలు ఆమెకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. 'పతి పత్నీ ఔర్ ఓ', 'ముక్తి', 'బాడీగార్డ్' తదితర చిత్రాల్లో ఆమె నటించారు. 30కి పైగా చిత్రాల్లో ఆమె కీలక పాత్రలు పోషించారు. బుల్లితెరపైనా తన ముద్ర వేశారు విద్య. 'కావ్యాంజలి', 'ఖుబూల్ హై', 'కుల్ఫీ కుమార్ బజేవాలా' లాంటి పదికి పైగా ధారావాహికల్లో నటించారు.

## మిత్రుడి ప్రేమ కోసం

పవన్, శైలజా జంటగా జి.మురళి తెరకెక్కిస్తున్న చిత్రం 'మేరా దోస్త్'. పి.వీరారెడ్డి నిర్మాత. వి.సాయిరెడ్డి స్వరకల్పనలోని ఈ చిత్ర గీతాలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. వి.ప్రకాశ్, బసిరెడ్డి, బెక్కెం వేణు గోపాల్ పాటల సీడీల్ని ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ "ఇద్దరు మిత్రుల కథ ఇది. బలహీనుడైన ఒక యువకుడి ప్రేమని నిలబెట్టేందుకు, అతని మిత్రుడు చేసిన ప్రయత్నం ఎలాంటిదన్నది ఆసక్తికరం" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "కొత్త రకమైన కథతో రూపొందించాం. త్వరలో విడుదల చేస్తాం" అన్నారు.



శైలజా, పవన్



అరుణ్ తేజ్, చరిష్మా శ్రీకర్

## నువ్వంటే హాయ్.. హాయ్

అరుణ్ తేజ్, చరిష్మా శ్రీకర్ జంటగా బి.ఎన్.రెడ్డి అభినయ తెరకెక్కించిన చిత్రం 'నీతోనే హాయ్ హాయ్'. యలమంచి ప్రవీణ్, ఏఎస్ కీర్తి, పార్థసారథి రెడ్డి నిర్మాతలు. 23న విడుదల కానుంది. కీలక పాత్ర పోషించిన పృథ్వీ మాట్లాడుతూ "చక్కటి ప్రేమకథ ఇది. ప్రచార చిత్రం చూస్తుంటే సినిమాపై నమ్మకం పెరిగింది. ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవాల"న్నారు. "ఏ విషయంలోనూ రాజీ పడకుండా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయ"న్నారు దర్శక నిర్మాతలు.

# ఇంతికి... ఇకత్ పట్టు

శుభకార్యాల్లో కంటికింపైన రంగుల్లో, ఆకట్టుకునే నేత పనితనం ఉన్న చీరల్ని ఎంచుకుంటేనే నిండుగా కనిపిస్తాం. అలాంటి వస్త్రశ్రేణిలో ముందుంటాయి ఇకత్ పట్టు చీరలు. నచ్చినవి ఎంచుకుంటే చాలు.

నగలు, దుస్తులు: KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
ఈ చీరలు విజయవాడ కళాంజలి షోరూంలో మాత్రమే లభిస్తాయి.













మోడల్స్: - ప్రియాంక, శ్రేయ
ఫొటోలు: - పాతూరి పద్మావతి

# వసుంధర

ఆరోగ్యంగా ఉండాలంటే... ఖరీదైన పండ్లు, పదార్థాలు తినాలనుకుంటారు కొందరు. ఆ అవసరం లేదు. మనకు నిత్యం అందుబాటులో ఉండే వాటిని, కాలానుగుణంగా దొరికే పండ్లను క్రమం తప్పకుండా తీసుకుంటే చాలు. డార్క్ చాక్లెట్, క్వినోవా, ఆలివ్ నూనె వంటి వాటిలో ఉండే పోషకాలు ఇతర పదార్థాల్లోనూ దొరుకుతాయి. వీటిద్వారా శరీరానికి అందే ఫ్లవనాయిడ్లు వ్యాధుల బారిన పడకుండా కాపాడతాయి. ఇంతకీ అవేంటంటే...

## ఖరీదైనవే తినక్కర్లేదు...



■ గుండె జబ్బులు, కడుపులో మంట, క్యాన్సర్లను నిరోధించే గుణాలున్న ఫ్లవనాయిడ్లు యాపిల్‌లోనూ దొరుకుతాయి. కాఫీ, టీ, జామ, మెంతులు, ఆవాలు, అల్లం, లవంగాలు, దాల్చిన చెక్క, ఎండుమిర్చి, పసుపు వంటి వాటిల్లోనూ ఇవి అధికమొత్తంలో ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. వీటిని తరచూ తీసుకుంటే గుండె, మెదడుకు సంబంధించిన అనారోగ్యాలను దూరం చేసుకోవచ్చు.

■ రోజూ ఓ యాపిల్, ఓ నారింజ పండు, వంద గ్రాముల పప్పు ధాన్యాలు ఆహారంలో ఉండేలా చూసుకుంటే శరీరానికి 500 మిల్లీగ్రాముల ఫ్లవనాయిడ్లు అందుతాయి. ఉసిరి, వాము, జీలకర్ర, యాలకులు... వంటివాటిల్లోనూ క్యాన్సర్లకు కారణమయ్యే ఫ్రీరాడికల్స్‌ను నిరోధించే ఫ్లవనాయిడ్లు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

■ తాజా పండ్లు, ఆకు కూరలు, కూరగాయలను ఆహారంలో ఎక్కువగా తీసుకుంటే ఈ పోషకం శరీరానికి అందుతుంది. మాంసాహారం తగ్గిస్తూ సమతులాహారం తీసుకుంటే యాంటీ ఆక్సిడెంట్లతో పాటు ఫ్లవనాయిడ్లూ అందుతాయి. ఎసిడిటీ కారణంగా వచ్చే మంటను తగ్గించడంతో పాటు వయసుతో వచ్చే అనారోగ్యాలను దూరం చేసేందుకు తోడ్పడతాయివి.

■ మెదడు, ఇతర శరీర భాగాలు ప్రాణవాయువును గ్రహించేందుకు ఫ్లవనాయిడ్లు ఉపయోగపడతాయి. మతిమరుపు, కుంగుబాటు, మూడ్ స్వింగ్స్ వంటివి దరిచేరవు.

■ ఇవి రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోకుండా చేయడంతో పాటు, అధిక రక్తపోటు సమస్య ఉన్నప్పుడు మెదడులో రక్తం గడ్డకట్టకుండా చేస్తాయి. తెల్లరక్తకణాల వృద్ధినీ పెంచుతాయి.

## స్నానానికి బియ్యంనీరు

బియ్యం కడిగిన నీటిని పులియబెట్టి... పలు సమస్యలకు వాడటం పురాతన కాలం నుంచీ వస్తున్నదే. ఈ నీటిని ఉపయోగించడం వల్ల కలిగే లాభాలేంటో చూద్దామా...

● బియ్యం కడిగిన నీటిని పులియబెట్టినప్పుడు అందులో బి విటమిన్లు తయారవుతాయి. దీనికి ఇతర పదార్థాలు కలిపి తీసుకుంటే తక్షణ శక్తి అందుతుంది. పేగుల ఆరోగ్యానికి, మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందడానికి, మెటబాలిజం పెరగడానికి తోడ్పడుతుంది.



● ఈ నీటితో స్నానం చేస్తే మృత కణాలు పోవడంతోపాటు చర్మం మెరుస్తుంది. దురద వల్ల వచ్చే మంటా తగ్గుతుంది. ఈ నీరు సహజ మాయిశ్చరైజర్‌గానూ పని చేస్తుంది. రోజూ దీంతో ముఖం కడుగుతూ ఉంటే మొటిమలు, మచ్చలు తగ్గుముఖం పడతాయి.

● కప్పు బియ్యం కడిగిన నీటిలో ఒక చెంచా తేనె, కొన్ని చుక్కల లావెండర్ నూనె కలిపి జుట్టుకు రాసుకోవాలి. పావు గంట తరువాత కడిగేసుకుంటే జుట్టు పట్టులా మెరుస్తుంది. దీన్ని నేరుగా తలకు పట్టించి మర్దన చేసుకున్నా ప్రయోజనం ఉంటుంది. దీంట్లో ఉండే బయోటిన్ జుట్టు ఒత్తుగా పెరగడానికి ఉపయోగపడుతుంది.

● ఈ నీటిలో ఉండే విటమిన్ బి6, ఇ, యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు రంగు మారడాన్ని నిరోధించడంతో పాటు తేమను అందిస్తాయి. చివర్లు చిట్లకుండానూ ఉంటాయి.

## ఎలా ఖర్చుపెట్టాలో నేర్పండి

పిల్లల్ని ముద్దు చేయడమంటే... అడిగిందల్లా ఇవ్వడం కాదు. కష్టం తెలియజేయాలి. డబ్బు విలువా చెప్పాలి. అప్పుడే వాళ్లకు పొదుపు గురించి ఓ అవగాహన ఉంటుంది.

● చిన్నారులు అడిగిందల్లా ఇవ్వడం బాగానే ఉంటుంది కానీ... అదే కొనసాగితే దానికే అలవాటు పడతారు. ఎప్పుడైనా మీరు ఇవ్వనంటే మొండిగా ప్రవర్తిస్తారు. అలాగని ఒక్కసారిగా వారి ఖర్చులకు కోతవేయడమో, అదుపు చేయాలనుకోవడమో సరికాదు. చెడు మార్గంలోకి వెళ్లే ప్రమాదమూ ఉంది. చిన్నతనం నుంచీ... డబ్బు విలువ తెలియజేయాలి. అవసరాలకు, కోరికలకు మధ్య తేడానూ స్పష్టంగా వివరించాలి. మీరెంత పొదుపుగా ఖర్చుపెడుతున్నారో దగ్గరుండి చూపించగలిగితే... వారికీ అర్థం అవుతుంది.

● మన చిన్నప్పుడు ఎవరైనా ఇచ్చిన డబ్బుల్ని దాచుకునే వాళ్లం కదా... పిల్లలకూ ఆ వివరాలు చెబుతూ.. ఎలా పొదుపు చేయాలో నేర్పించండి. వారిని ఆకట్టుకునే ఆకృతుల్లో ఎన్నో రకాల కిడ్డీ బ్యాంకులు, స్మార్ట్ బ్యాంక్‌లు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. వాళ్లకు నచ్చింది కొనిచ్చి... ఎలా వాడాలో తెలియజేయండి. కొంచెం పెద్ద పిల్లలైతే వారి పేరు మీద సొంత ఖాతా తెరిచి ప్రతి నెలా వారితో డబ్బులు జమ చేయించండి.

● చిన్నారులు పెద్దవాళ్లను అనుసరిస్తారంటారు. మీరు డబ్బు, పొదుపు విషయంలో కచ్చితంగా ఉంటే... వాళ్లూ ఎలా ఉండాలో నేర్చుకుంటారు. నెల ప్రారంభంలో ఆర్భాటాలకు పోయి ఆదాయాన్నంతా ఖర్చుచేసి నెల చివర్లో దంపతులిద్దరూ కీచులాడుకుంటే ఆ ప్రభావం పిల్లలపైనా పడుతుంది.



● అవసరాలు, విలాసాలకు మధ్య ఉన్న తేడాను తెలియజేయాలి. ఎప్పుడయినా ఓ వస్తువు కొనుక్కోవాలనుకున్నప్పుడు మీరు ఒకేసారి డబ్బు ఇచ్చేయకుండా... అప్పుడప్పుడూ ఇచ్చినవి దాచుకుని కొనుక్కోమనండి. కొంత సమయం వాయిదా వేస్తారు. ఆ తరువాత అవసరం ఉంటే కొనుక్కుంటారు లేదా విరమించుకుంటారు.

● వాళ్లకు ఇచ్చిన డబ్బును ఎలా ఖర్చు పెడుతున్నారో రోజూ ఓ పుస్తకంలో రాసుకోమనండి. వారాంతంలో ఒకసారి చూసుకుంటే అనవసర ఖర్చులు తెలిసిపోతాయి.

**నజరానా**

మసాలా పొడి తొందరగా పురుగు పట్టకుండా ఉండాలంటే నూనె లేకుండా వేయించి కొద్దిగా ఉప్పు కలిపి భద్రపరచండి.

## బంగారం వెండి

15న ముగింపు-క్రితం



| | హైదరాబాద్ | | విజయవాడ | |
|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | -------- | 38,600 | -------- | 38,570 |
| ఆర్నమెంట్ | -------- | 36,070 | -------- | 35,720 |
| వెండి (కిలో) | -------- | 44,890 | -------- | 44,800 |
| | ప్రొద్దుటూరు | | రాజమహేంద్రవరం | |
| బంగారం(24క్యా) | -------- | 37,600 | 39,040 | 39,040 |
| ఆర్నమెంట్ | -------- | 34,450 | 35,780 | 35,780 |
| వెండి (కిలో) | -------- | 43,500 | 45,400 | 45,400 |
| | విశాఖపట్నం | | తమిళనాడు | |
| బంగారం(24క్యా) | 38,830 | 38,610 | -------- | -------- |
| ఆర్నమెంట్ | 36,120 | 35,910 | -------- | 3,578 గ్రా |
| వెండి (కిలో) | 45,500 | 45,700 | -------- | 47.90 గ్రా |

## పరిశోధనతో పతాకస్థాయికి...

ఆ సంస్థ పేరు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఐఎన్ఎస్ఏ). దాని 85 ఏళ్ల చరిత్రలో మొదటిసారి ఓ మహిళ అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. ఆమే జీవశాస్త్రవేత్త డాక్టర్ చంద్రిమా షా. త్వరలో ఆమె ఆ సంస్థ బాధ్యతలు చేపట్టనున్నారు. డాక్టర్ చంద్రిమ దిల్లీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తూ అదే విభాగానికి డైరెక్టర్‌గా ఉన్నారు. ఐఎన్ఎస్ఏ ఉపాధ్యక్షురాలిగానూ ఉన్నారు. పరిశోధనలోకి ప్రవేశించకముందు క్రికెటర్‌గా, ఆల్ ఇండియా రేడియోలో క్రికెట్ కామెంటేటర్‌గా పని చేశారు. క్రికెట్ ఆడటం వల్ల తనకు టీం వర్క్ విలువ తెలిసిందని అంటారామె. కోల్‌కతా విశ్వవిద్యాలయంలో మాస్టర్ ఆఫ్ సైన్స్‌లో పట్టా పుచ్చుకున్నారు. ఆ తరువాత ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ బయాలజీలో పరిశోధన చేపట్టారు. కాన్సాస్ మెడికల్ సెంటర్ విశ్వవిద్యాలయం



నుంచి రెండేళ్లు పరిశోధన చేశారు. మరో రెండేళ్లు న్యూయార్క్‌లోనూ పనిచేశారు. 1984లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీలో పరిశోధకురాలిగా చేరారు.

### సమస్యలు ఉన్నా...

కణాలు హరించిపోవడం, తగ్గిపోవడంలో సంకేతాలు అందించే మార్గాలపై ప్రస్తుతం ఆమె పరిశోధన సాగుతోంది. క్యాన్సర్ కణాలు, లీష్మానియా వంటి పరాన్నజీవులు చంద్రిమ పరిశోధనలో ప్రధాన అంశాలు. 'నేను కొత్తగా విధుల్లో చేరినప్పుడు చుట్టూ ఉండే మగవారు నా నిర్ణయాలను తిరస్కరించేవారు. పలకరించేవారు కాదు. ఈ సమస్యలు నన్ను ఆపలేకపోయాయి. కేవలం చేసే పనిపైనే దృష్టి పెట్టేదాన్ని. ఆ కష్టమే నాకు ఇప్పుడు గుర్తింపు తెచ్చింది. ఈ అరుదైన అవకాశం అందుకున్నందుకు చాలా ఆనందంగా ఉంది..' అని చెబుతారు చంద్రిమా షా.

## సరిహద్దు గీసేయండి!



ప్రతి ఇంట్లోనూ సమస్యలు ఉంటాయి. కొందరు వాటిని నేర్పుగా.... పరిష్కరించుకుంటే, మరికొందరు మరింత జటిలం చేసుకుంటారు. ఆ పరిస్థితిని అధిగమించాలంటే...

■ ఇంటి బాధ్యతల్లో మహిళల పాత్ర కీలకం. అలాని అన్నీ తామే చేయాలనుకోవడం పొరబాటు. దానివల్ల పనిఒత్తిడి అధికమవుతుంది. కుటుంబ సభ్యుల సాయం తీసుకోండి. పనిభారం తగ్గుతుంది.

■ కుటుంబంలో సమస్యలు సర్వసాధారణం. వాటిని అక్కడికే పరిమితం చేయాలి తప్ప... అదేపనిగా వాటిని ప్రస్తావించకూడదు. దేన్నయినా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేలా చూడాలి. గతాన్ని వీలైనంతవరకూ తవ్వకపోవడమే మంచిది.

■ ఇంటిని, విధుల్ని సమన్వయం చేసుకోవడం చాలామంది మహిళలకు ఎదురయ్యే సవాలు. దానికి పరిష్కారం మీ చేతుల్లోనే ఉంది. రెండింటికీ సరిహద్దు గీసుకోండి. వీలైనంతవరకూ ఇంటి సమస్యల్ని ఆఫీసుకు తీసుకురాకండి. ఆఫీసు పనిని ఇంటికి మోసుకెళ్లకండి. ఇంట్లో ఉన్నప్పుడు కుటుంబసభ్యులతోనే గడిపేలా చూసుకోవాలి.

**కొండలు, గుట్టలు గుండా వెళ్లిపోతుంటే ఎల్లాగ ఉంటుంది?**
**ఆ కొండవాలులో తేయాకు తోటలు పరుచుకుంటే మనసుకు ఎల్లాగ అనిపిస్తుంది?**
**అడపాదడపా జలపాతాలు పలకరిస్తే ఆ ప్రయాణం ఎల్లాగ సాగుతుంది?**
**మధ్యలో ఆధ్యాత్మిక, విహార కేంద్రాలు ఎదురైతే మరి ఎల్లాగ ఉంటుందో చూడాలని ఉందా.. అయితే ఎల్లాకేగాల్సిందే!**
**శ్రీలంకలోని కాండీ నుంచి మొదలయ్యే రైలు మార్గంలో ప్రయాణించాల్సిందే !!!**

భారతావనిలో కశ్మీరం.. ఇండోనేషియాలో బాలి ఎలాగో.. శ్రీలంకలోనూ ఓ అద్భుతం దాగుంది. చిట్టిదేశం హృదయస్థానంలో పచ్చల పతకంలా మెరిసిపోతూ ఉంటుందా ప్రాంతం. మధ్య శ్రీలంకలోని సింహభాగం ఎత్తయిన కొండలు, గుట్టలే. అంతులేని ప్రకృతి సంపదతో అలరారుతూ దర్శనమిస్తుంది. ఈ సింహళ సౌందర్యాన్ని మనసారా ఆస్వాదించాలంటే అనువైన మార్గం రైలు ప్రయాణమే! లంకలోని ప్రధాన నగరాల్లో ఒకటైన కాండీ నుంచి ఎల్లా మీదుగా బాదుల్లా వరకు ప్రయాణిస్తే చాలు.. లంకెంత అందంగా ఉంటుందో తెలుస్తుంది. లంకంత ఆనందం లభిస్తుంది.



### వనం ఒడిలో నుంచి..

కాండీ నుంచి బాదుల్లాకు విరివిగా రైళ్లున్నాయి. శ్రీలంక రాజధాని కొలొంబో నుంచీ కాండీ మీదుగా కొన్ని రైళ్లున్నాయి. కాండీ-బాదుల్లా మధ్య దూరం సుమారు 175 కిలోమీటర్లు ఉంటుంది. ఈ చిన్ని దూరమే జీవితానికి సరిపడా జ్ఞాపకాలను ఇస్తుంది. బాదుల్లా కన్నా ముందు ఎల్లా రైల్వేస్టేషన్ వస్తుంది. కాండీ నుంచి ఎల్లా వరకూ ఉన్న 140 కి.మీ. మార్గం పర్యాటకులకు స్వర్గధామంగా చెబుతారు. లంక ప్రకృతి సంపదంతా ఈ దారిలోనే దారికాచిందా అన్నట్టు ఉంటుంది. కాండీ దాటిన కాసేపటికి రైలు వనం ఒడిలోకి ప్రవేశిస్తుంది. దట్టమైన అడవిలో కాసేపు.. కొండల్లో ఇంకాసేపు.. టీ ఎస్టేట్స్ దాటుకుంటూ దూసుకుపోతుంది. రైలు ఎక్కింది మొదలు ప్రయాణికులకు నేత్రపర్వమే! ఎటు చూసినా పచ్చదనమే. ఎటు చూడాలో తెలియదు. ఎంతసేపు చూసినా తృప్తి కలగదు. మేఘాలతో కబుర్లు చెప్పే గిరులు, వాటి నిండా తరులు, వాటి మీదుగా వీచే చల్లటి గాలులతో మనసు ఉల్లాసభరితం అవుతుంది. అంతలోనే వంతెనెక్కిన రైలు లయ మార్చి ప్రయాణికుల ఉత్సాహానికి వంతపాడుతుంది. కాసేపటికి సొరంగంలోకి దూసుకెళ్లి.. నానా హంగామా చేస్తుంది. అందులో నుంచి తేరుకునేలోపే.. ఇరువైపులా జలపాతాలను చూపించి ఆనందం పాలు పెంచుతుంది. ఈ సంతోషం కోసం దేశవిదేశాల నుంచి పర్యాటకులు లంకకేగుతారు. కేవలం కాండీ-ఎల్లా రైలు ప్రయాణం కోసమే ఇక్కడికి వచ్చే పర్యాటకులూ ఉన్నారు. ఆరు గంటల పాటు సాగే ప్రయాణం ఆశ్చర్యానందాలను కలగజేస్తుంది.

### ప్రయాణం పరిపూర్ణం..

కాండీ-ఎల్లా రైలు మార్గానికి ఎంత పేరుందో.. దారి వెంట ఉన్న పర్యాటక కేంద్రాలూ అంతే ప్రాశస్త్యం కలిగి ఉన్నాయి. హాటన్, నువర ఎలియా, హపుతలే తదితర ప్రదేశాలు శ్రీలంక పర్యాటక వింతల్లో గుర్తింపు ఉన్నవే. ఆయా ప్రాంతాల్లో రైలు దిగి.. ఓ రోజంతా అక్కడి విశేషాలు చూసి.. మర్నాడు ప్రయాణాన్ని కొనసాగిస్తారు ఔత్సాహికులు. సమయం లేదనుకున్న వాళ్లు రైలు ప్రయాణంతో సరిపుచ్చుకుంటారు. ఏది ఎంచుకున్నా పర్యటన పరిపూర్ణం అయిందనే అనుభూతి తప్పకుండా కలుగుతుంది.

### నో ఆన్‌లైన్ సేవలు

లంకలో రైళ్లకు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునే అవకాశం లేదు. 45 రోజుల ముందు నుంచి అడ్వాన్స్ బుకింగ్ ఇస్తారు. ప్రయాణం రోజే టికెట్లు తీసుకోవచ్చు. కాండీ నుంచి ఎల్లాకు గంటకో రైలు ఉంటుంది. టికెట్లు సులభంగానే లభిస్తాయి. ప్రైవేట్ టూర్ ఆపరేటర్లు ప్యాకేజీలో భాగంగా రైలు టికెట్లు ఏర్పాటు చేస్తుంటారు.

# ఎల్లారికీ స్వాగతం



### ఆనందం అంచెలంచెలుగా

### కాండీ-హాటన్ (45 కి.మీ.)

కాండీ నుంచి ప్రయాణం మొదలయ్యాక మొదటగా వచ్చే పర్యాటక కేంద్రం హాటన్. కొండ ప్రాంతం కావడంతో వాతావరణం చల్లగా ఉంటుంది. ఇక్కడికి సమీపంలో ఆడమ్స్ పీక్ పర్వతం ఉంటుంది. 2243 మీటర్ల ఎత్తుండే గిరిపై ట్రెక్కింగ్ ఈవెంట్లు జరుగుతుంటాయి. సూర్యోదయానికి ముందే కొండ అంచుకు చేరుకుని తొలిసంధ్యను ఆస్వాదిస్తారు. ఈ గిరిపై హిందూ, బౌద్ధ ఆలయాలున్నాయి. దీనిని శ్రీపాద గిరిగా భావిస్తారు. పరమశివుడు ఇక్కడ పాదం మోపాడని హిందువులు, బుద్ధుడి పాదముద్రగా బౌద్ధులు, ఆడమ్స్ తొలి అడుగు వేసింది ఇక్కడేనని ఇతర మతాల వారు విశ్వసిస్తారు.



### ఇలా వద్దు..

- లంకలో ఊరూరా బౌద్ధ ఆరామాలు దర్శనమిస్తాయి. బుద్ధుడి విగ్రహానికి వీపు చేసి నిలబడొద్దు. బుద్ధుడికి అభిముఖంగా ఉండి ఫొటోలు దిగొచ్చు కానీ, బుద్ధుడికి వీపు చూపిస్తూ ఫొటోలు దిగకూడదు.
- బుద్ధుడి బొమ్మలు ఉన్న దుస్తులు ఇక్కడ ధరించకూడదు.
- అనుమతి లేకుండా బౌద్ధ భిక్షువుల ఫొటోలు తీయకూడదు. ఒకవేళ అనుమతిచ్చినా.. అతిగా నవ్వడం, వేళ్లతో వింత సంజ్ఞలు చేస్తూ ఫొటోలు దిగకూడదు.



### ఏ కాలం.. అనుకూలం?

భారీ వర్షాలు కురిసే అక్టోబరు-నవంబరు మినహా మిగతా కాలమంతా మధ్య శ్రీలంక పర్యటనకు అనుకూలం. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. జనవరి-ఏప్రిల్ వరకు ప్రశాంతంగా ఉంటుంది.

### హపుతలే-ఎల్లా (25 కి.మీ.)



కాండీ నుంచి హపుతలే వరకు ప్రయాణమే అద్భుతం అనుకుంటే.. ఇక్కడి నుంచి ఎల్లా మార్గం మహాద్భుతమని అభివర్ణిస్తారు. రైలు మార్గం దట్టమైన అడవి గుండా సాగుతుంది. ఆకాశాన్నంటే చెట్లు, అంతు తెలియని లోయలతో ఆశ్చర్యకరంగా ఉంటుందీ దారి. మార్గం మధ్యలో నైన్‌ఆర్చ్ బ్రిడ్జ్ వస్తుంది. వంతెన చుట్టుపక్కల చూసేందుకు పర్యాటకులు క్యూ కడతారు. ఎల్లా సమీపంలో రావణ జలపాతం అద్భుతంగా ఉంటుంది. రావణ గుహలనూ చూడొచ్చు. నగరం శివారులో జలపాతాలు, వ్యూపాయింట్లు మరెన్నో ఉంటాయి.

- ఈ రైలు మార్గంలోని ప్రధాన పర్యాటక కేంద్రాల్లో బస సౌకర్యం ఉంది. రోజుకు రెండు ప్రాంతాలు చుట్టేసినా.. రెండు రోజుల్లో కాండీ-ఎల్లా ప్రయాణం విజయవంతంగా పూర్తి చేసుకోవచ్చు.

- హైదరాబాద్ నుంచి శ్రీలంక రాజధాని కొలొంబో వరకు నాన్‌స్టాప్ విమాన సర్వీసు ఉంది. చెన్నై నుంచి విమానాలు ఎక్కువగా అందుబాటులో ఉంటాయి. టికెట్ ధర రూ.4,200 నుంచి రూ.8,500 మధ్య ఉంటుంది.
- శ్రీలంక వెళ్లే భారతీయ పర్యాటకులకు వీసా ఆన్ అరైవల్ లభిస్తుంది. దీని కోసం కనీసం ఆరునెలల గడువు ఉన్న పాస్‌పోర్ట్, వ్యక్తిగత ధ్రువీకరణ పత్రం ఉండాలి. 30 రోజుల గడువుతో అనుమతిస్తారు.

### హాటన్- నాను ఒయా (38 కి.మీ.)

లంకలోని ప్రధాన పర్యాటక కేంద్రాల్లో ఒకటి నువర ఎలియా. ఈ పట్టణ శివారులో నాను ఒయా రైల్వే స్టేషన్ ఉంటుంది. హాటన్ నుంచి నాను ఒయా మార్గంలో తేయాకు తోటలు విస్తారంగా ఉంటాయి. నువర ఎలియా పౌరాణిక ప్రాశస్త్యం ఉన్న ప్రాంతం. సీతాదేవిని అపహరించిన రావణుడు.. ఆమెను ఈ ప్రాంతంలోనే ఉంచాడని చెబుతారు. ఇందుకు నిదర్శనంగా నువర ఎలియాకు మూడున్నర కిలోమీటర్ల దూరంలో సీతా అమ్మన్ ఆలయం కనిపిస్తుంది. సీతమ్మను బంధించి ఉంచిన అశోకవనం ఆలయానికి సమీపంలోనే ఉంటుంది. ఈ ప్రాంతంలో ఆంజనేయుడి పాదముద్రలనూ చూడొచ్చు. గాల్వేస్ ల్యాండ్ నేషనల్ పార్క్, లవర్స్‌లీప్ జలపాతం ఇక్కడ ప్రధాన ఆకర్షణలు.



### నాను ఒయా-హపుతలే (32 కి.మీ.)

ఈ మార్గంలో వచ్చే మరో అందమైన ప్రాంతం హపుతలే. చిన్న పట్టణంలో టీ ఫ్యాక్టరీని సందర్శించవచ్చు. సమీపంలో జలపాతాలున్నాయి. లిప్టన్ వ్యూ పాయింట్ ప్రధాన పర్యాటక కేంద్రం.



### బుక్ నౌ



## ముందస్తుగా.. నేపాల్ మస్తుగా

విహారంలో వినోదంతో పాటు ఆధ్యాత్మికం కోరుకుంటున్న వారి కోసం ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) 'నేచురల్ నేపాల్' పేరుతో కొత్త ప్యాకేజీ ప్రకటించింది. హైదరాబాద్ నుంచి గోరఖ్‌పూర్ వరకు విమానంలో తీసుకెళ్తారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో ప్రయాణం ఉంటుంది.

వ్యవధి: 7 రాత్రులు-8 పగళ్లు
ఎప్పుడు: అక్టోబరు 18
**చూపించే ప్రదేశాలు:** లుంబిని, ఫోఖరా, కాఠ్మాండు, చిత్వాన్ నేషనల్ పార్క్
**ప్యాకేజీ ధర:** రూ.37,670 (పెద్దలకు: ఒక్కరికి-ఇద్దరున్నప్పుడు)
రూ.35,870 (5-11 ఏళ్లలోపు పిల్లలకు)

మరిన్ని వివరాలకు www.irctctourism.com వెబ్‌సైట్‌ని చూడండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు: 96865 75202, 97013 60701, 040-27702407

### ట్రిప్‌కో టిప్

## హ్యాకబంధులతో జాగ్రత్త!

- సాధరణంగా రెస్టారెంట్లు, హోటళ్లు, ఇతర ప్రదేశాల్లో ఉచిత వైఫై అందుబాటులో ఉంటోంది. పాస్‌వర్డ్ లేని వైఫై జోన్లు హ్యాకర్లకు అడ్డాగా మారుతున్నాయి. ఉచిత వైఫై జోన్లలో ఉన్న ఫోన్లలో చొరబడటం తేలిక. డాటా ఉచితంగా లభిస్తుంది కదా అని.. ఉచిత వైఫై సేవలను విచ్చలవిడిగా వాడేయకండి.
- విహార కేంద్రాల్లో చరవాణికి ఛార్జింగ్ చాలా అవసరం. దీని కోసం ఛార్జింగ్ పాయింట్లను ఆశ్రయిస్తాం. పవర్ పాయింట్లతో సమస్య లేదు. కానీ, యూఎస్‌బీ ఛార్జింగ్ పాయింట్లు అంత సురక్షితం కాదు. ఛార్జింగ్ కోసం యూఎస్‌బీ కేబుల్ పెట్టగానే.. ఫోన్‌లోని సమాచారం హ్యాకర్లకి చిక్కొచ్చు.
- విహారంలో సామాజిక మాధ్యమాల జోరు చాలా పెరిగింది. ఎక్కడ ఉన్నది, ఎటు వెళ్తున్నది, ఏమిటి చూస్తున్నది.. హ్యాకర్లకు కావాల్సిన సమాచారం అంతా అడక్కుండానే సోషల్ మీడియాలో ప్రచురించేస్తుంటారు. దీని ఆధారంగా దాడి చేసే మహానుభావులూ ఉంటారు.



**ఇవి పాటించండి..**

- ఫోన్‌కు ఫింగర్‌ప్రింట్ సెక్యూరిటీ ఇవ్వండి. స్ట్రాంగ్‌పాస్‌వర్డ్ సెట్ చేసుకోవాలి.
- వైఫై, బ్లూటూత్ ఆటో కనెక్ట్ ఆప్షన్‌ని టర్న్ ఆఫ్ చేయండి.
- పబ్లిక్ వైఫై జోన్లలో వీపీఎన్ సర్వీస్ ద్వారా నెట్ సేవలు వినియోగించండి.
- ఛార్జింగ్ కోసం పవర్ బ్యాంక్ దగ్గరుంచుకోండి.

## సాగిపో హాయిగా..

మేఘాలలో తేలిపోతూ.. తుపానుల దూసుకుపోతూ.. నచ్చిన ప్రదేశాలకు వెళ్తుంటారు బైక్ రైడింగ్ ప్రియులు. వేగం కన్నా ప్రాణం మిన్న' అనే స్పృహ తప్పనిసరి. ఇదొక్కటే కాదు.. బైక్ ప్రయాణం సాఫీగా సాగాలంటే ఇలా చేయండి..



- ఏ మార్గంలో వెళ్తున్నారో దానిపై స్పష్టమైన అవగాహన ఉండాలి.
- రాత్రి వేళలో ప్రయాణం అస్సలు వద్దు. సాయంత్రంలోగా చిన్నదో, పెద్దదో పట్టణానికి చేరుకోవాలి.
- వాహనం మంచి కండిషన్‌లో ఉన్నా, మేటి సామర్థ్యం కలిగి ఉన్నా.. 80 కి.మీ./గంట వేగం మించకూడదు.
- మూడు గంటలకు మించి ఏకధాటిగా బైక్ నడపొద్దు. మార్గం మధ్యలో చిన్న చిన్న విరామాలిస్తూ, స్థానికంగా దొరికే చిరుతిళ్లను మితంగా తింటూ ముందుకు సాగిపోవాలి.

# కోట కబుర్లు మానేరు విందులు!

**ఓవైపు మానేరు నీటి గలగలలు.. ఇంకోవైపు చరిత్రకు సాక్షిగా నిలబడిన కోట.. ఆహ్లాదకరమైన వాతావరణం.. విహారానికి ఇంతకన్నా అనువైన ప్రదేశం ఏముంటుంది. ఇంతకీ పేరు చెప్పలేదు కదూ! ఎలగందుల కోట. కాకతీయుల కోటగా, నవాబుల ఖిల్లాగా పేరొందిన ఎలగందుల.. ఇప్పుడు సాహసవంతుల ట్రెక్కింగ్ జోన్. విద్యార్థులకు విజ్ఞానయాత్ర చిరునామా. సాధారణ పర్యాటకులకు ఆహ్లాదాల విహార కేంద్రం.**

కరీంనగర్‌కు సరిగ్గా 14 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది ఎలగందుల కోట. శతాబ్దాల చరిత్రకు సజీవ సాక్షిగా నిలిచిన కోట కొండపై ఠీవీగా కనిపిస్తుంది. కొత్తపల్లి మండలం ఎలగందుల సమీపంలో ఉండటంతో.. దీనికి ఆ పేరు స్థిరపడింది. కాకతీయుల కాలంలో దీనిని నిర్మించినట్టు చెబుతారు. కోట నిర్మాణ శైలి కాకతీయుల కళావైభవానికి ప్రతీకగా కనిపిస్తుంది. కచేరు, బందిఖానా, అశ్వశాల, ధాన్యాగారాలు, ఫిరంగిశాల, లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఇవన్నీ కోటలో చూడొచ్చు. నవాబుల కాలంలో నిర్మించిన దర్గా మరో ఆకర్షణ.

కోటపై నుంచి కనుచూపు మేరలో పచ్చని పొలాలు మనసుకు ఆహ్లాదాన్నిస్తాయి. మరోవైపు మానేరు జలరాశి ఆశ్చర్యం కలిగిస్తుంది. కోటలో విహరించడానికి నిత్యం వందల మంది పర్యాటకులు వస్తుంటారు. ప్రవేశ రుసుం రూ.10. రాత్రి వేళలో రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులతో కోట ప్రకాశించిపోతుంది. డిజిటల్ సౌండ్ సిస్టం ఏర్పాటు చేశారు. లైట్ షోను తిలకించడానికి రూ.50 రుసుం చెల్లించాలి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరపై ఎలగందుల చరిత్రను ప్రదర్శిస్తారు.

### సమీపంలో

- ఎలగందుల నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ సుమారు 29 కి.మీ. దూరంలో ఉంటుంది. బస్సులు, ట్యాక్సీలు అందుబాటులో ఉంటాయి.
- కరీంనగర్ పట్టణం ఎలగందుల నుంచి కేవలం 14 కి.మీ. దూరంలో ఉంటుంది. ఇక్కడే మానేరు డ్యాం ఉంది. ఎలగందుల వచ్చిన పర్యాటకులు పనిలో పనిగా మానేరు జలాశయాన్నీ సందర్శిస్తారు. జలాశయం పరిసరాలు ప్రకృతి రమణీయతతో అలరిస్తాయి. సమీపంలోని జింకల పార్క్ ఆటవిడుపునిస్తుంది. జలాశయంలో బోటింగ్ అవకాశమూ ఉంది.

– తుమ్మల శ్రీనివాస్, కరీంనగర్

### వారాంతంలో..



**చేరుకునేదిలా:** హైదరాబాద్ నుంచి కరీంనగర్ 162 కి.మీ. దూరంలో ఉంటుంది. వరంగల్ నుంచి 78 కి.మీ. దూరంలో ఉంటుంది. కరీంనగర్ నుంచి ఎలగందుల కోటకు బస్సులు, ఆటోల్లో వెళ్లొచ్చు.





“కమిటీలు యుద్ధాలు చేయలేవు.”
రెండో ప్రపంచ యుద్ధకాలంలో బ్రిటన్‌కు ప్రధాన మంత్రిగా వ్యవహరించిన విన్‌స్టన్ చర్చిల్ చేసిన వ్యాఖ్య ఇది. దేశ రక్షణకు సంబంధించిన అంశాల్లో కమిటీలతో ప్రయోజనం ఉండదని, ఆచరణాత్మక చర్యలు ఉండాలన్నది ఆయన ఉద్దేశం.

# త్రిదళాధిపతి

## సీడీఎస్ వ్యవస్థతో తొలగనున్న సమన్వయ లోపం

ఈ పాఠాన్ని ఒంటబట్టించుకొని భారత్.. దేశ భద్రతకు సంబంధించిన ఒక కీలక అంశంపై దాదాపు రెండు దశాబ్దాలుగా కమిటీలతో కాలం వెలిబుచ్చింది. రక్షణ రంగ తీరుతెన్నులను సమూలంగా మార్చేసే ఈ అంశానికి ఎట్టకేలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పచ్చజెండా ఊపారు. రెండోసారి ప్రధాన మంత్రి పదవిని చేపట్టాక చేసిన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఈ ప్రకటనను చేశారు. త్రివిధ దళాలైన సైన్యం, నౌకాదళం, వైమానిక దళాలకు కలిపి ఉమ్మడిగా రక్షణ బలగాల అధిపతి (సీడీఎస్) పదవిని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అమెరికా సహా అనేక ప్రధాన ప్రజాస్వామ్య దేశాల్లో సీడీఎస్ తరహా వ్యవస్థ ఇప్పటికే ఏర్పాటైంది.

### రెండు దశాబ్దాలుగా..

1999లో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన కార్గిల్ యుద్ధం అనంతరం.. దేశ భద్రతా వ్యవస్థలో ఉన్న లోపాలపై పరిశీలనకు ఏర్పడ్డ సుబ్రమణ్యం కమిటీ తొలిసారిగా సీడీఎస్ పదవి ఏర్పాటును సిఫార్సు చేసింది. 2001లో ఏర్పడ్డ మంత్రుల బృందం కూడా దీనికి మద్దతు పలికింది. ఏకాభిప్రాయం లేకపోవడం, అపోహల కారణంగా ఇది ముందడుగు పడలేదు.

- సీడీఎస్‌పై అపోహలను తొలగించడానికి 2012లో నరేశ్ చంద్ర కమిటీ సీవోఎస్‌సీకి శాశ్వత అధిపతి పదవిని సృష్టించాలని సూచించింది. ప్రస్తుతం ఈ పదవిని సీనియార్టీ ఆధారంగా వంతులువారీగా త్రివిధ దళాల అధిపతులకు ఇస్తున్నారు.
- 2016లో ఏర్పడ్డ లెఫ్టినెంట్ జనరల్ డి.బి. షెకత్కార్ కమిటీ కూడా సీడీఎస్ ఏర్పాటుకు సిఫార్సు చేసింది.

### ఏమిటీ సీడీఎస్

రక్షణ అంశాలకు సంబంధించి ప్రభుత్వానికి సలహాలిచ్చే ఏకైక కేంద్రంగా సీడీఎస్ పనిచేస్తుంది. ఈ పదవిని చేపట్టే అధికారి త్రివిధ దళాలకు సంబంధించిన అంశాలపై సూచనలు చేస్తారు. దీనివల్ల దేశ రక్షణ బలగాల పరస్పర సంధానతకు వీలు కలుగుతుంది. త్రివిధ దళాలకూ ఆయన నాయకత్వం వహిస్తారు. ‘ఫైవ్‌స్టార్ సైనికాధికారి’గా ఉంటారు.

### ఎందుకీ విధానం?

భారత్ చాలా సంక్లిష్టమైన భద్రతా సవాళ్లను ఎదుర్కొంటోంది. పొరుగు దేశాల నుంచి అణ్వస్త్ర ప్రమాదం, అపరిష్కృత సరిహద్దు వివాదాలు, సీమాంతర ఉగ్రవాదం, సుదీర్ఘ సముద్ర తీర భద్రత వంటివి ఉన్నాయి. సున్నితమైన ఇన్ని అంశాలను త్రివిధ దళాలు విడివిడిగా నిర్వర్తిస్తున్నాయి. వీటిపై ప్రభుత్వానికి సలహా ఇచ్చే అత్యున్నతస్థాయి అధికార వ్యవస్థ కొరవడింది. త్రివిధ దళాలూ దేశ రక్షణ కోసమే పని చేస్తాయి. అయితే శిక్షణ, కార్యకలాపాలు సహా అనేక అంశాల్లో మూడింటి మధ్య వైరుధ్యాలు ఉన్నాయి. బడ్జెట్ కేటాయింపులు, ఆయుధాలు, సాధన సంపత్తి కొనుగోలు, డిమాండ్ల విషయంలో ఎవరి వాదన వారిదే. వీటి మధ్య సమన్వయం కోసమే సీడీఎస్ అవసరం. ఉమ్మడి యుద్ధ వ్యూహాలు, సైనిక కార్యకలాపాల్లో మెరుగైన సమన్వయానికి ఇది వీలు కలిగిస్తుంది.

### ప్రస్తుతం ఇలాంటి వ్యవస్థ లేదా?

ప్రస్తుతం త్రివిధ దళాధిపతుల్లో అత్యంత సీనియర్‌ను చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ (సీవోఎస్‌సీ) ఛైర్మన్‌గా నియమిస్తున్నారు. ఇది తాత్కాలిక చర్యే. సీవోసీఎస్ ఛైర్మన్ కేంద్రానికి సలహాలిస్తుంటారు. అయితే ఆ అధికారికి మిగతా ఇద్దరు అధిపతులపై ఎలాంటి నియంత్రణ ఉండదు. ఏకాభిప్రాయం ఆధారంగా వీరు పనిచేస్తారు. ఆయన తీసుకున్న నిర్ణయాలను మిగతా ఇద్దరు అధిపతులు తప్పనిసరిగా అమలు చేయాల్సిన అవసరంలేదు. శాంతి సమయంలో దీనివల్ల పెద్దగా ఇబ్బంది లేకున్నా.. యుద్ధ సమయంలో మాత్రం దేశ భద్రతా యంత్రాంగం మొత్తం ఒకే మాట, వ్యూహంపై సాగాలి.

- ప్రస్తుతం రక్షణ రంగానికి సంబంధించిన ప్రతి అంశాన్ని రక్షణశాఖ కార్యదర్శి పర్యవేక్షిస్తున్నారు. అయితే ఈ పదవిలో ఐఏఎస్ అధికారిని నియమిస్తున్నారు. ఈ అధికారికి రక్షణ రంగంపై పూర్తిస్థాయి అవగాహన ఉండదన్న వాదన ఉంది.

## అనుభవం నేర్పిన పాఠాలు



దశాబ్దాలుగా భారత త్రివిధ దళాల మధ్య పూర్తిస్థాయి సమన్వయం లేదు. చైనాతో 1962లో జరిగిన యుద్ధంలో భారత వైమానిక దళానికి ఎలాంటి పాత్ర దక్కలేదు. ఒకవేళ అవకాశం ఇచ్చి ఉంటే మనకు పరాజయం తప్పేదన్న విశ్లేషణలు ఉన్నాయి.

- 1971 నాటి భారత్-పాక్ యుద్ధంలో పరిమిత స్థాయిలో మూడు దళాల మధ్య సమన్వయం సాధ్యమైంది. దీనికి నాడున్న సంస్థాగత ఏర్పాటు కారణం కాదు. నాటి సైన్యాధిపతి శామ్ మానేక్షాకు నౌకాదళ, వాయు సేన అధిపతులతో చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీనివల్ల మూడు దళాల మధ్య సమన్వయం సాధ్యమైంది. ఫలితంగా ఈ యుద్ధంలో భారత్ భారీ విజయాన్ని నమోదు చేసింది.
- 1999 నాటి కార్గిల్ యుద్ధంలో తొలుత సమన్వయం లోపించినప్పటికీ తర్వాతి దశలో భారత సైన్యం, వైమానిక దళం కలిసికట్టుగా సాగాయి. దీనివల్ల పాక్ చొరబాటుదారులు మట్టికరిచారు.

## తొలి సీడీఎస్‌గా జనరల్ రావత్?



సీడీఎస్ నియామకానికి సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వానికి సిఫార్సు చేయడానికి కేంద్రం ఒక అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది నవంబర్ కల్లా ఈ కమిటీ నివేదిక ఇస్తుందని వివరించాయి. ప్రస్తుత సీవోఎస్‌సీ ఎయిర్ చీఫ్ మార్షల్ బి.ఎస్.ధనోవా వచ్చే నెల 30న పదవీ విరమణ పొందుతారు. ఆ తర్వాత ఆ బాధ్యతలను సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ చేపడతారు. ఈ నేపథ్యంలో తొలి సీడీఎస్ కూడా ఆయనే అవుతారని భావిస్తున్నారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం



రక్షా బంధన్ సందర్భంగా గురువారం దిల్లీలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి రాఖీ కడుతున్న ఓ పాఠశాల విద్యార్థిని

## భారత దౌత్యాధికారికి పాక్ సమన్లు

ఇస్లామాబాద్, దిల్లీ: నియంత్రణ రేఖ వెంబడి భారత సైనికులు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో తమ సైనికులు ముగ్గురు చనిపోయారని నిరసిస్తూ భారత డిప్యూటీ హైకమిషనర్ గౌరవ్ అహ్లూవాలియాకు పాకిస్థాన్ సమన్లు జారీచేసింది. గురువారం సమన్లు జారీచేసి, భారత్ సైనికులు జరిపిన కాల్పులను ఖండించినట్లు పాక్ విదేశాంగ కార్యాలయం పేర్కొంది.

### పాకిస్థాన్‌ది కట్టుకథ: భారత సైన్యం

నియంత్రణ రేఖ వద్ద జరిగిన కాల్పుల్లో ఐదుగురు భారత సైనికులు హతమయ్యారంటూ పాకిస్థాన్ పేర్కొనడాన్ని కట్టుకథగా మన సైన్యం పేర్కొంది. సరిహద్దుల్లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు పాక్ సైనికులు, ఐదుగురు భారత సైనికులు హతమయ్యారంటూ పాక్ సైనిక అధికార ప్రతినిధి మేజర్ జనరల్ ఆసిఫ్ గఫూర్ చెప్పేది కట్టుకథ అని స్పష్టంచేసింది.

- పాకిస్థాన్ ఎలక్ట్రానిక్ మీడియా నియంత్రణ సంస్థ పెమ్రా.. భారతీయ కళాకారులు నటించిన ప్రకటనలను ప్రసారం చేయడాన్ని నిషేధించింది. జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దును వ్యతిరేకిస్తూ పాక్ తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే తాజా నిర్ణయం వెలువడింది.

## న్యాయవ్యవస్థలో అనుచిత ధోరణులు: సీజేఐ

దిల్లీ: న్యాయస్థానాల్లో అనుచిత, అమర్యాదకర దృష్టాంతాలు ఎన్నడూ లేనంతగా పెరుగుతున్నాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయవ్యవస్థ గౌరవాన్నీ, మర్యాదను కాపాడేందుకు ఇలాంటి చర్యలను గుర్తించి కట్టడి చేయాలని అభిప్రాయపడ్డారు. గురువారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో జాతీయపతాకాన్ని ఆవిష్కరించి ఆయన ప్రసంగించారు. న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటున్నందున సుప్రీంకోర్టు, హైకోర్టులకు మధ్యన అప్పీలు న్యాయస్థానాలు ఉండాలని, దేశంలోని నాలుగు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. మరోవైపు.. రాజ్యాంగంలోని 370వ అధికరణం రద్దును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టనుంది.

## జకీర్ నాయక్‌పై మలేసియాలో దర్యాప్తు ప్రారంభం

కౌలాలంపూర్: వివాదాస్పద ముస్లిం మత ప్రబోధకుడు జకీర్ నాయక్‌పై మలేసియా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆయనకు వ్యతిరేకంగా మొత్తం 115 పోలీస్ నివేదికలు అందాయని సీఐడీ డైరెక్టర్ డాటుక్ హుజీర్ మొహమ్మద్ గురువారం తెలిపారు. విద్వేష ప్రసంగాలు, నగదు అక్రమరవాణాకు సంబంధించిన కేసుల్లో జకీర్ నాయక్‌ను తమకు అప్పగించాల్సిందిగా భారత్ కోరుతోంది. తాజాగా కోటాబారూ నగరంలో జరిగిన ఓ సమావేశంలో జకీర్ మాట్లాడుతూ.. మలేసియాలో ఉంటున్న హిందువులు ఇక్కడి ప్రధాన మంత్రి మహాతిర్ మొహమ్మద్ కంటే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే విధేయులుగా ఉంటారని వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ విషయమై బుధవారం కొందరు మంత్రులు ప్రధాని మహాతిర్‌తో మాట్లాడుతూ.. నాయక్‌ను భారత్‌కు అప్పగించాలని, ఆయన ప్రసంగాలు విద్వేషపూరితంగా ఉంటున్నాయని ఫిర్యాదుచేశారు. మరోవైపు, మలేసియా ప్రధాని మహాతిర్ మంగళవారం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. నాయక్‌ను భారత్‌కు అప్పగించబోమని, ఆ దేశంలో ఆయనను చంపేస్తారని పేర్కొన్నట్లు సమాచారం.

## ఒక కృత్రిమ చెట్టు = 368 సహజవృక్షాలు

ప్యూబ్లా (మెక్సికో): పర్యావరణ పరిరక్షణకు చెట్లు చేసే మేలు అపారమైనది. బొగ్గుపులుసు వాయువును పీల్చుకుని, ప్రాణవాయువును ప్రసాదిస్తున్నాయి. కానీ.. అవి పెరగాలంటే తగినంత స్థలం, సమయం కావాలి. దీనిపై దృష్టిపెట్టిన మెక్సికన్ అంకుర పరిశ్రమ బయోమిటెక్ కృత్రిమచెట్లను రూపొందించింది. ఇవి ఒక్కోటి 368 సహజ వృక్షాలకు సమానమట. అన్ని చెట్లు పీల్చుకునేంత బొగ్గుపులుసు వాయువును ఒక్క కృత్రిమ చెట్టే పీల్చుకుని, ఆక్సిజన్‌ను అందిస్తుంది. “ఒక్కో కృత్రిమ చెట్టు 14 అడుగుల ఎత్తు, 3 అడుగుల వెడల్పు ఉంటుంది. సాంకేతికత సాయంతో కార్బన్-డై-ఆక్సైడ్, ఇతర కాలుష్య కారకాలను శుద్ధిచేస్తుంది. ఇందుకు సముద్రజలాల్లోని మైక్రోఫైట్స్‌ను ఉపయోగిస్తుంది” అని సంస్థ వ్యవస్థాపకుడు జైమె ఫెరెర్ చెప్పారు. ఒక్కో చెట్టు తయారీకి రూ.35 లక్షలు ఖర్చవుతుందట. ఇప్పటివరకూ ప్యూబ్లా, కొలంబియా, పనామాల్లో వీటిని నెలకొల్పారు. వాహనాల రద్దీ అధికంగా ఉండే చోట ఇవి చాలా ఉపశమనం కలిగిస్తాయని చెబుతున్నారు.

## హాంకాంగ్ ఉద్యమాన్ని అణచివేస్తాం: చైనా

హాంకాంగ్: ఆందోళనలు శ్రుతిమించితే చూస్తూ ఊరుకోబోమని హాంకాంగ్ ఉద్యమకారులను చైనా హెచ్చరించింది. స్థానిక ప్రభుత్వం వీటిని నియంత్రించలేకపోతే... జాతీయ ప్రభుత్వం రంగంలోకి దిగుతుందని స్పష్టం చేసింది. లండన్‌లో చైనా రాయబారి లియూ జియామింగ్ గురువారం ఈ వ్యాఖ్యలు చేశారు. స్థానిక పాలనలో చైనా జోక్యాన్ని నిరసిస్తూ హాంకాంగ్‌లోని ప్రజాస్వామ్యవాదులు ఉద్యమాన్ని తీవ్రతరం చేసిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు హాంకాంగ్ సమస్యపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. “చైనాలో ఉద్యోగాలు పోతున్నాయి. పరిశ్రమలు మూతపడుతున్నాయి. దీంతో ఆ దేశం మాతో వాణిజ్య ఒప్పందం చేసుకోవాలనుకుంటోంది. అయితే, ముందు హాంకాంగ్ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలి. చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ తలచుకుంటే దీనిని సత్వరమే పరిష్కరించగలరు” అని ట్రంప్ అన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే చైనా సైనికులు హాంకాంగ్ సరిహద్దుల్లో కవాతు చేశారు.


## కశ్మీర్‌పై నేడు ఐరాస రహస్య చర్చలు?

- భేటీ జరపాలని భద్రతామండలికి చైనా లేఖ
- పాక్ విజ్ఞాపనకు వంతపాడిన డ్రాగన్

ఐరాస: జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయంపై పాకిస్థాన్ వ్యక్తంచేసిన అభ్యంతరాలకు చైనా వంతపాడింది. కశ్మీర్‌పై చర్చించేందుకు ఐక్యరాజ్యసమితి(ఐరాస) భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించాలని కోరుతూ పాక్ లేఖ రాయగా, దాన్ని సమర్థిస్తూ చైనా మరో లేఖ రాసింది. ‘భారత్- పాకిస్థాన్ సమస్య’ను అజెండాలో పెట్టాలని, దీనిపై రహస్య సంప్రదింపులు జరపాలని చైనా ఆ లేఖలో కోరింది. ఆ మేరకు శుక్రవారమే చర్చ జరిగే అవకాశం ఉంది. ఆగస్టులో భద్రతామండలి అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిస్తున్న పోలెండ్ రాయబారి జోన్నా రొనెక్కా దీనిపై స్పందిస్తూ సమావేశం జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. కశ్మీర్ విషయమై భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించాలని కోరుతూ లేఖ సమర్పించిన విషయాన్ని పాకిస్థాన్ విదేశాంగశాఖ మంత్రి షా మహమూద్ ఖురేషీ గురువారం వెల్లడించారు. నాలుగు దశాబ్దాల తర్వాత భద్రతామండలిలో కశ్మీర్ సమస్య చర్చకు రానుండడం తమ దౌత్య విజయమని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో చైనా అధికారులు తమ దౌత్యాధికారులకు అన్ని విధాలుగా సహకరించనున్నారని తెలిపారు. పాక్ చేసిన విజ్ఞప్తిని మన్నించిన చైనా అందులో భాగంగానే ఈ లేఖ రాసింది.

మరోవైపు ఇది తమ అంతర్గత విషయమని ఇదివరకే అంతర్జాతీయ సమాజానికి భారత్ స్పష్టంచేసింది. వాస్తవాలను గుర్తించాలని పాకిస్థాన్‌కూ సూచించింది. భారత విదేశీ వ్యవహారాల మంత్రి జయ్‌శంకర్ చైనా వెళ్లి ఆ దేశ విదేశాంగ మంత్రితో చర్చలు జరిపారు. పరిపాలన సౌలభ్యం, ఆర్థిక-సామాజిక ప్రగతి కోసం రాజ్యాంగం ప్రకారం మార్పులు చేశామని వివరించారు. అంతర్జాతీయ సరిహద్దుల్లో మార్పుల్లేవని చెప్పారు. ఇది తమ అంతర్గత వ్యవహారమని, పాకిస్థాన్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ అంటోనియో గుటెరస్ ఇప్పటికే స్పందిస్తూ జమ్మూ-కశ్మీర్ హోదాపై ప్రభావం చూపే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా భారత్, పాకిస్థాన్ పూర్తి స్థాయి సంయమనం పాటించాలని కోరారు.



తుంబ కేంద్రంలో తొలినాళ్లలో రాకెట్ పరికరాన్ని బిగిస్తున్న కలాం (కుడి)

## విశ్వ శోధనలో 50 ఏళ్లు

యావద్దేశంలో స్వాతంత్ర్య వేడుకలు అంబరాన్ని అంటిన వేళ.. దేశ కీర్తిపతాకాన్ని విశ్వ వినువీధుల్లోకి మోసుకెళ్లిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 50 వసంతాలను పూర్తి చేసుకుంది. దేశ సాంకేతిక సత్తాను ప్రపంచం ముందు సగర్వంగా చాటిన ఈ సంస్థ 1969 ఆగస్టు 15న తన ప్రస్థానాన్ని అధికారికంగా ప్రారంభించింది. ఎడ్ల బండ్లు, సైకిళ్లపై రాకెట్, ఉపగ్రహ విడిభాగాలను తరలించి రోదసిలోకి ప్రయోగించే స్థాయినుంచి ఈ సంస్థ నేడు అగ్రరాజ్యాలకు దీటుగా చంద్రుడు, అంగారకుడి వద్దకు ఉపగ్రహాలను ప్రయోగించే స్థాయికి చేరింది. మానవసహిత అంతరిక్ష యాత్రకూ సమాయత్తమవుతోంది. దేశ అంతరిక్ష పితామహుడు విక్రమ్‌సారాభాయ్ శతజయంతి ఉత్సవాలనూ ఈయేడు నిర్వహించుకుంటున్నాం.

## వైభవంగా స్వాతంత్ర్య వేడుకలు

- పలువురు దేశాధినేతల శుభాకాంక్షలు

దిల్లీ: భారతదేశ 73వ స్వాతంత్ర్య వేడుకలు దేశవ్యాప్తంగా వైభవంగా జరిగాయి. పలువురు నాయకులు దేశంలోని పలు ప్రాంతాలలో మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రధాని మోదీ దేశవాసులకు స్వాతంత్ర్య దినోత్సవం, రక్షాబంధనం సందర్భంగా ట్విటర్ ద్వారా శుభాకాంక్షలు అందించారు. భాజపా సీనియర్ నేత ఎల్‌కే ఆడ్వాణీ తన ఇంటివద్ద పతాకావిష్కరణ చేశారు. వైరల్ జ్వరంతో బాధపడుతున్నా ఆయన మానుకోలేదు. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ నాగ్‌పుర్‌లోని సంఘ్ ప్రధాన కార్యాలయంలో జెండా ఎగరేశారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ పార్టీ ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

- భారతదేశానికి బాలోచ్‌లు శుభాకాంక్షలు తెలిపారు. పాక్ నుంచి స్వాతంత్ర్యం కావాలన్న తమ ఆకాంక్షను అన్ని వేదికలపై భారత్ ప్రస్తావించాలని ఉద్యమకారులు కోరారు.

### ప్రపంచనేతల శుభాకాంక్షలు

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా పలు దేశాల అధినేతలు, అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో భారతీయులకు శుభాకాంక్షలు చెప్పారు.

- జమ్మూ-కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని తొలగించడాన్ని నిరసిస్తూ.. భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాకిస్థాన్ గురువారం బ్లాక్ డేగా పాటించింది. ఇందులో భాగంగా గురువారం ప్రధాన నగరాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించారు.



హరియాణాలో ద్విచక్ర వాహనంపై ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్

### లద్దాఖ్‌లో ఎంపీ నృత్యాలు

లేహ్: లద్దాఖ్ ప్రాంతంలో స్వాతంత్ర్య వేడుకల్ని ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఎంపీ జమ్యంగ్ డ్రమ్స్ వాయిస్తూ స్థానికులతో కలిసి నృత్యాలు చేశారు. భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌తో కలిసి పార్టీ స్థానిక కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఎగరేశారు. కేంద్రపాలిత ప్రాంతంగా లద్దాఖ్‌కు తొలి స్వాతంత్ర్య దినోత్సవం అని రాసి ఉన్న బ్యానర్లను రహదారులపై ప్రదర్శించారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.



### కశ్మీరీ గుర్తింపు చెరగదు: మాలిక్

శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని రద్దు చేసినా కశ్మీరీ గుర్తింపేమీ దెబ్బతినబోదని గవర్నర్ సత్యపాల్ మాలిక్ హామీ ఇచ్చారు. ఆయన శ్రీనగర్‌లో జెండావిష్కరణ చేశారు. కార్యక్రమానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ హాజరయ్యారు. ప్రధాన పార్టీల నేతలెవ్వరూ రాలేదు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించలేదు. కశ్మీర్ లోయలో స్వాతంత్ర్య వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని, అవాంఛనీయ సంఘటనలూ లేవని జమ్మూ-కశ్మీర్ ముఖ్యకార్యదర్శి రోహిత్ కన్సల్ తెలిపారు.

### ఈ స్వీటు బంగారం గానూ..!




మహారాష్ట్ర: ఇక్కడ స్వీటు కేజీ రూ. 9 వేలు మాత్రమే.. ఇంత రేటేమిటి అనుకుంటున్నారా? ప్రత్యేకత తెలుసుకుంటే ఎవరైనా ఓసారి కొనుక్కొందామనే అనుకుంటారు. ఈ మిఠాయిలకు అచ్చంగా బంగారం పూస్తారు మరి. అదీ రక్షాబంధన్ వంటి రోజుల్లో మాత్రమే అమ్ముతారు. మిఠాయి విక్రేతల్లో పోటీ పెరిగిపోతుండటంతో వినియోగదారులను ఆకర్షించేందుకు నాసిక్‌లోని ఓ దుకాణం ఈ స్వీట్లు అమ్మకానికి పెట్టింది. రుచి మాటెలా ఉన్నా.. వీటి ప్రత్యేకత తెలిసిన వారంతా పావుకేజీ అయినా కొందామనే అనుకుంటుంటారు. ఈ దుకాణంలో ఎన్నో రకాల మిఠాయిలను తయారు చేసి, వాటికి బంగారు పూత వేసి రక్షాబంధన్ సందర్భంగా విక్రయించారు. జనాలు కూడా ఎగబడి కొన్నారు. ఇలాంటి ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే లభించే వీటిని కొనడం అదో క్రేజీ.

### ఏమిటీ.. కేజీ రూ. 75 వేలా!

అసోం: మొన్న రూ. 50 వేలు.. నిన్న రూ. 70 వేలు.. ఇప్పుడు ఏకంగా రూ. 75 వేలు.. ఇవన్నీ బంగారం రేట్లు కాదు. అసోంలో కేజీ టీ పొడికి దక్కిన ధర. దిబ్రూగఢ్‌లో డికోమ్ అనే కంపెనీ తయారు చేసిన ‘గోల్డెన్ బటర్ ఫ్లై టీ’ పాత రికార్డులను బద్దలు కొట్టింది. ఇటీవలే కేజీకి మనహరి గోల్డ్ టీ, మైజాన్ టీలు భారీ ధరకు అమ్ముడు పోయాయి. అంతకు మించిన స్థాయిలో బటర్ ఫ్లై టీ రూ. 75,000 పలికింది. దీని పేరు వెనుక కూడా ఆసక్తికరమైన సంగతులున్నాయి. నాణ్యతలో దానికదే సాటి. ఈ కంపెనీ తోటలో 12.5 లక్షల కేజీల టీని ఉత్పత్తి చేస్తుంది. దీని తయారీ ప్రకృతి మీద ఆధారపడి ఉంటుంది. ఏడాదిలో ఏదో ఒకసారి ప్రత్యేక జాతికి చెందిన సీతాకోక చిలుకలు ఈ తోటల్లో వాలుతాయి. ఆ సమయంలోనే ఈ టీ పొడిని తయారు చేస్తారు.




### ఆటో సోదరుడు

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

ఛత్తీస్‌గఢ్: రక్షాబంధన్ వేడుక సోదర భావనకు ప్రతీక.. మహిళలను అక్కాచెల్లెళ్లుగా భావించి గౌరవించే మన సంప్రదాయానికి ఈ పండగనాడు ఛత్తీస్‌గఢ్‌లో ఓ ఆటోడ్రైవర్ మరింత ప్రత్యేకత తీసుకొచ్చారు. కొరియా అనే ప్రాంతంలో ఆటోను నడుపుకొనే జితేంద్ర కార్తీక్ మహిళలకు ఉచితంగా సేవలందించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణించినా వారి నుంచి డబ్బులేమీ తీసుకోకుండా సోదరభావాన్ని చాటుకున్నారు. రక్షాబంధన్ రోజున చాలామంది ఆటోలు నడపరని.. మహిళలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా గత ఆరేళ్లుగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నానని కార్తీక్ చెబుతున్నారు.




### పదేళ్లకు అమ్మ దొరికింది



ఉత్తర్‌ప్రదేశ్: సరిగ్గా పదేళ్ల క్రితం.. ఆ యువకుడి గుండె బద్ధలైంది. మానసిక స్థితి సరిగాలేని అమ్మ ఎటో వెళ్లిపోయింది. తల్లడిల్లిన మనసుతో ఊరూ వాడా గాలించాడు. పోలీసులకు చెప్పాడు. ఫలితం లేకపోయింది. ఆమె ఎక్కడో ఉండి ఉంటుందని అతని మనసు మాత్రం చెబుతూనే ఉంది. ఇన్నాళ్లకు అతని ఆశ ఫలించింది. యూపీ పోలీసుల కృషితో ఆ యువకుడు అమ్మను కలుసుకున్నాడు. గుజరాత్‌లోని సఖేడాకు చెందిన శాంతాబాయి గతంలో ఇంటి నుంచి వెళ్లిపోగా.. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం కుమారుడు మహేంద్ర ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఈ తరుణంలో కొద్ది రోజుల క్రితం మహేంద్రకు ఓ శుభవార్త అందింది. ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్‌లోని శంషాబాద్ పట్టణంలో చిన్నపిల్లలను అపహరిస్తుందనే అనుమానంతో స్థానికులు ఒక మహిళపై దాడి చేసి పోలీసులకు అప్పగించారు. ఆమె దైన్యస్థితిని చూసి పోలీసులే చలించిపోయారు. ఆమెను చేరదీసి.. మెల్లిగా వివరాలు రాబట్టారు. వాటి ఆధారంగా గుజరాత్ పోలీసుల ద్వారా చివరకు మహేంద్రకు సమాచారం అందించగలిగారు. వెంటనే శంషాబాద్ వెళ్లిన అతను పదేళ్ల తర్వాత తల్లిని చూశాడు. ఆమె కూడా కన్నబిడ్డను గుర్తుపట్టి హత్తుకుంది. వారి ఆనందానికి అవధుల్లేకపోయాయి.

# చమురు భారథానికి మళ్లీ సౌదీనే రాజు!

● అతిపెద్ద సరఫరాదారుగా అవతరించే అవకాశం
● ఆర్‌ఐఎల్‌లో వాటా కొనుగోలు నేపథ్యం



మన దేశానికి అతిపెద్ద చమురు సరఫరా దేశంగా సౌదీ అరేబియా తన అగ్రస్థానాన్ని తిరిగి చేజిక్కించుకోనుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్)కు చెందిన చమురు- రసాయనాల (ఓటీసీ) విభాగంలో 20 శాతం వాటాను సౌదీ సంస్థ అరామ్‌కో కొనుగోలు చేయడం ఇందుకు దోహదం చేయొచ్చన్నది అంచనా. ఓటీసీలో 20 శాతం వాటాను 1500 కోట్ల డాలర్లతో కొనుగోలు చేసేందుకు ఆర్‌ఐఎల్‌తో అరామ్‌కో ఒప్పందం చేసుకున్న సంగతి విదితమే. ఈ ఒప్పందంలో భాగంగా ఆర్‌ఐఎల్ రిఫైనరీకి రోజుకు 5 లక్షల బ్యారెళ్లు లేదా సంవత్సరానికి 25 మిలియన్ టన్నుల ముడి చమురును అరామ్‌కో సరఫరా చేయనుంది. అరామ్‌కో చేయనున్న ఈ అదనపు సరఫరానే 'భారత్‌కు అతిపెద్ద చమురుదారు' కిరీటాన్ని సౌదీకి తిరిగి తెచ్చిపెట్టనుంది.

**ఇరాక్‌ను వెనక్కినెట్టి..** ...... వాస్తవానికి కొన్నేళ్లపాటు సౌదీ అరేబియానే భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా ఉండేది. అయితే గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఆ స్థానాన్ని ఇరాక్ ఆక్రమించింది. 2018-19లో సౌదీ అరేబియా కంటే 15 శాతం అధికంగా ఇరాక్ నుంచి భారత్‌కు ముడి చమురు సరఫరా అయ్యింది. రిలయన్స్‌తో ఒప్పందం అమల్లోకి వచ్చాక, అరామ్‌కో అదనంగా చేయనున్న చమురు సరఫరాతో ఇరాక్‌ను సౌదీ అరేబియా వెనక్కినెట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

- **2.2** మి.టన్నులు — 2018-19లో భారత్‌కు రష్యా చమురు ఎగుమతి
- **6.4** మి. టన్నులు — 2018-19లో భారత్‌కు అమెరికా ముడి చమురు ఎగుమతి
- **24** మి.టన్నులు — 2018-19లో ఇరాన్ భారత్‌కు ఎగుమతి చేసిన ముడి చమురు
- **40.33** మిలియన్ టన్నులు — 2018-19లో సౌదీ అరేబియా నుంచి భారత్‌కు సరఫరా అయిన ముడి చమురు
- **46.61** మిలియన్ టన్నులు — 2018-19లో ఇరాక్ భారత్‌కు సరఫరా చేసిన ముడి చమురు. ప్రస్తుతం భారత్‌కు ఇరాకే అతిపెద్ద చమురు సరఫరాదారు

**భారత్ చమురు తీరుతెన్నులు**

- ✦ భారత్ తన ముడిచమురు అవసరాల్లో 80% వరకు దిగుమతి చేసుకుంటోంది.
- ✦ 2040 కల్లా ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న చమురు వినియోగ విపణిగా భారత్ అవతరిస్తుందని ఓ అంచనా.
- ✦ ప్రస్తుతం భారత్‌లో రోజుకు సుమారు 5 మిలియన్ బ్యారెళ్ల చమురు వినియోగం జరుగుతోంది. ఇది 2035 కల్లా 8.2 మిలియన్ బ్యారెళ్లకు పెరిగే అవకాశం ఉంది.
- ✦ ఈ ఏడాది భారత్‌లో చమురు గిరాకీ రోజుకు 1,70,000 బ్యారెళ్లు మేర పెరుగుతుండగా.. 2020 కల్లా గిరాకీ వృద్ధి 2,25,000 బ్యారెళ్లకు చేరే అవకాశం ఉంది.

గణాంకాలు: డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్& స్టాటిస్టిక్స్

# 2 రోజుల్లోనే రూ.29,000 కోట్లు



## ఆర్‌ఐఎల్ ఏజీఎం తర్వాత భారీగా పెరిగిన ముకేశ్ సంపద

దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) అనంతరం ఆ సంస్థ అధినేత, అపర కుబేరుడు ముకేశ్ అంబానీ సంపద గణనీయ స్థాయిలో పెరిగింది. రెండు రోజుల్లోనే రూ. 29,000 కోట్లు అధికమైంది. గతంలో ఎన్నడూ, ఇంత తక్కువ కాలంలో అంత భారీగా ఆయన సంపద వృద్ధి చెందలేదు. సోమవారం నాటి ఏజీఎంలో పలు కీలక నిర్ణయాలను ముకేశ్ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ తీసుకున్న సంగతి తెలిసిందే. వచ్చే 18 నెలల్లో రిలయన్స్ గ్రూపును రుణరహిత కంపెనీ మార్చే ప్రణాళిక ఉందని ముకేశ్ ప్రకటించారు. సౌదీ సంస్థ అరామ్‌కోకు పెట్రో వ్యాపారంలో, బ్రిటిష్ పెట్రోలియమ్‌కు రిటైల్ పెట్రోల్‌బంకుల్లో వాటాల విక్రయం, సెప్టెంబరులో జియో ఫైబర్ సేవల ప్రారంభం లాంటి నిర్ణయాలు మదుపర్లలో ఉత్సాహాన్ని నింపాయి. ఈ ప్రభావం షేరుకు సానుకూలతను తెచ్చిపెట్టింది. ఏజీఎం (ఆగస్టు 12న) తర్వాత రెండు రోజుల్లో ఆర్‌ఐఎల్ షేరు 11 శాతం మేర పెరిగింది. బీఎస్ఈలో ఆర్‌ఐఎల్ షేరు గత శుక్రవారం రూ.1,162 వద్ద ముగియగా.. బుధవారం రూ.1,288.30 వద్ద స్థిరపడింది. దీంతో ముకేశ్ సంపద కూడా 4 బిలియన్ డాలర్లు (రూ.28,684 కోట్లు) పెరిగింది. జూన్ 30 నాటికి ఆర్‌ఐఎల్‌లో ప్రమోటరు, ప్రమోటర్ గ్రూపు వాటా 47.29% ఉంది. బ్లూమ్‌బర్గ్ కుబేరుల సూచీ ప్రకారం.. ప్రస్తుతం ప్రపంచంలోని అత్యంత శ్రీమంతుల్లో ముకేశ్ అంబానీ 13వ స్థానంలో ఉన్నారు. ఆయన మొత్తం సంపద 49.9 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,50,000 కోట్లు).

ఈనాడు బిజినెస్

# ఓఎన్‌జీసీ రూ.83,000 కోట్ల పెట్టుబడులు

● కొన్నేళ్లుగా నిలిచిపోయిన 25 ప్రాజెక్టులపై
● కంపెనీ సీఎండీ శశి శంకర్

దిల్లీ: గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన 25 ప్రధాన ప్రాజెక్టులపై దాదాపు రూ.83,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఓఎన్‌జీసీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) శశి శంకర్ పేర్కొన్నారు. ఇందులో 15 ప్రాజెక్టులను పూర్తి చేసే పనిలో ఉన్నామని, ఇవి చమురు- గ్యాస్ ఉత్పత్తిని పెంచేందుకు దోహదపడతాయని వివరించారు. 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డెహ్రాడూన్‌లో కంపెనీ ప్రధాన కార్యాలయం నుంచి వెబ్‌కాస్ట్ ద్వారా 30000కు పైగా ఉద్యోగులకు సందేశం ఇచ్చారు. ఈ 25 ప్రాజెక్టుల జీవిత కాలంలో మొత్తం 180 మిలియన్ టన్నులకు పైగా చమురు, చమురుకు సమానమైన గ్యాస్ ఉత్పత్తి కావొచ్చని అంచనా వేశారు. 2018-19లో దేశీయ క్షేత్రాల నుంచి ఓఎన్‌జీసీ 24.23 మిలియన్ టన్నుల ముడిచమురును, 25.81 క్యూబిక్ మీటర్ల సహజ వాయువును ఉత్పత్తి చేసింది. విదేశీ క్షేత్రాల నుంచి మరో 10.1 మిలియన్ టన్నుల చమురు, 4.736 బీసీఎం సహజవాయువును రాబట్టింది. 2023-24 నాటికి 32 బీసీఎం సహజవాయువును ఉత్పత్తి చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు శంకర్ తెలిపారు. 'ఎనర్జీ వ్యూహం 2040'తో ఉత్పత్తి, రిఫైనింగ్, మార్కెటింగ్, ఇతర వ్యాపారాల్లో ఆదాయం మూడింతలు కానుందని, లాభం నాలుగింతలు, కంపెనీ మార్కెట్ విలువ 5-6 రెట్లు పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఓఎన్‌జీసీ పనితీరు ఇలా..:** 2018-19లో రికార్డు స్థాయిలో కంపెనీ ఆదాయం 29 శాతం వృద్ధితో రూ.1,09,655 కోట్లకు చేరింది. నికర లాభం సైతం 34 శాతం అధికమై రూ.26,716 కోట్లుగా నమోదైంది. కంపెనీ విదేశీ విభాగం ఓఎన్‌జీసీ విభాగం అత్యధికంగా 14.83 మిలియన్ టన్నుల చమురు, చమురుకు సమానమైన గ్యాస్‌ను ఉత్పత్తి చేసింది. మరో అనుబంధ సంస్థ ఎంఆర్‌పీఎల్ సైతం 16.43 మిలియన్ టన్నుల చమురును శుద్ధి చేసింది. సామర్థ్య వినియోగం 109.5 శాతంగా నమోదైంది. ఇటీవల కొనుగోలు చేసిన హెచ్‌పీసీఎల్ సైతం రికార్డు స్థాయిలో 38.7 మిలియన్ టన్నుల విక్రయాలు నమోదు చేసిందని, దేశీయ విక్రయాలు 4.7 శాతం పెరిగాయని శంకర్ తెలిపారు. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఇటీవల ప్రకటించిన కొత్త విధానాలు, భారత చమురు- గ్యాస్ రంగంలో సానుకూల మార్పులు తీసుకొస్తాయని వెల్లడించారు.

# ఆ కాంట్రాక్టు మనకొద్దు

● అమెరికా ఇమిగ్రేషన్ అధికారులతో కలిసి పనిచేయలేం
● గూగుల్‌కు ఉద్యోగుల విన్నపం

శాన్ ఫ్రాన్సిస్కో: మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడే అమెరికా ఇమిగ్రేషన్ అధికారులతో కలిసి పనిచేయొద్దని... వారి పాపాల్లో తాము భాగస్వాములం కాదలచుకోలేదని వందల మంది గూగుల్ ఉద్యోగులు తమ యాజమాన్యాన్ని అభ్యర్థించారు. గూగుల్‌తో పాటు అమెజాన్, మైక్రోసాఫ్ట్‌లు క్లౌడ్ కంప్యూటింగ్ సేవలు అందిస్తున్నాయి. యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) విభాగం భారీ క్లౌడ్ కంప్యూటింగ్ కాంట్రాక్టుకు ఒప్పందం కుదుర్చుకోనుందని తెలియడంతో, సుమారు 600 మంది గూగుల్ ఉద్యోగులు తమ యాజమాన్యాన్ని అప్రమత్తం చేశారు. సీబీపీతో కలిసి పనిచేయడమంటే మానవ హక్కుల ఉల్లంఘనకు అవసరమైన సాంకేతిక వసతులు కల్పించడమే అవుతుందని, అలాంటి కాంట్రాక్టు కోసం తాము పనిచేయలేమని తెగేసి చెప్పారు. చిన్నపాటి లాభం కోసం ఉన్నతమైన గూగుల్ సంస్థ సమగ్రతను తాకట్టు పెట్టవద్దని అభ్యర్థించారు. ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్; ది ఆఫీస్ ఆఫ్ రిఫ్యూజీ సెటిల్మెంట్; సీబీపీలకు మద్దతుగా పనిచేయబోమని బహిరంగంగా ప్రకటించాలని యాజమాన్యాన్ని కోరారు.

## ఆహార వ్యాపారాలకు భద్రతా ఆడిట్ తప్పనిసరి: ఎఫ్ఎస్ఎస్ఏఐ

దిల్లీ: పాడి పరిశ్రమ, కోళ్లు, చేపలు, గుడ్లు, మాంసం, వాటి ఉత్పత్తులతో వ్యాపారం, క్యాటరింగ్ చేసేందుకు లైసెన్సు పొందిన ఆహార వ్యాపార నిర్వాహకు (ఎఫ్‌బీఓలు)లకు ఆహార భద్రతా ఆడిట్ తప్పనిసరి అని పేర్కొంటూ, భారత ఆహార భద్రతా, ప్రమాణాల సాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అధిక ప్రమాదం పొంచి ఉన్న ఆహార పదార్థాల విభాగంలోని ఆరు వ్యాపారాలకు భద్రతా ఆడిట్ తప్పనిసరి చేశారు. . అందులో పాల ఉత్పత్తులు, మాంసం - మాంస ఉత్పత్తులు, చేపలు-చేపల ఉత్పత్తులు, గుడ్లు-గుడ్ల ఉత్పత్తులు, శిశు పోషణ ఆహారం, సిద్ధం చేసిన ఆహారాలను (క్యాటరింగ్ ఫుడ్) చేర్చింది. ఈ ఆహార వ్యాపారాలు నిర్వహించే కంపెనీలు ధ్రువీకరణ పొందిన ఆడిట్ ఏజెన్సీలతో ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించిన కాల పరిమితుల్లో భద్రతా ఆడిట్ చేయించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.



**15న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)** (100కు రూపాయలలో)

కోడిగుడ్లు

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 331 | వరంగల్ | 334 |
| చిల్లరగా (ఒక గుడ్డు) | 3.90 | విశాఖపట్నం | 352 |
| బెంగళూరు | 340 | చెన్నై | 355 |
| 16వ తేదీకి... | | చిత్తూరు | 348 |
| విజయవాడ | 339 | | |
| గోదావరి | 334 | నమక్కల్ | 355 |

# ఏమిటీ.. ఎందుకు

**ఇపుడెవరూ ఎక్కువ డబ్బులు జేబులో పెట్టుకుని తిరగడం లేదు. ఏటీఎం/డెబిట్‌కార్డుతో చెల్లింపులు జరపడం.. మరీ అవసరమైతే ఏటీఎమ్‌కు వెళ్లి కావాల్సినంత తెచ్చుకోవడమే. నెలలో అలా ఎన్నిసార్లు వెళతామో తెలియదు. నగదు తీసిన ప్రతిసారీ ఒక లావాదేవీ కింద లెక్కే..**

**అలాగే.. ఖాతాలో నగదు ఎంత నిల్వ ఉందో చూసుకునేందుకు ఏటీఎంకి వెళ్లి, చూసుకుంటుంటాం. దీన్ని కూడా ఒక లావాదేవీగా బ్యాంకులు పరిగణిస్తున్నాయో లేదో కూడా మనకు తెలియదు.**

**ఏది ఉచిత లావాదేవీయో.. ఏ లావాదేవీకి ఛార్జీ విధిస్తారో చాలా మందికి అవగాహన ఉండకపోవచ్చు.**

**ఒక్కోసారి ఏటీఎమ్‌లో నగదు లేకపోవడం వల్లో.. మరే ఇతర సాంకేతిక సమస్య వల్లో డబ్బులు రావు. అయినా కూడా లావాదేవీ కింద నమోదవుతూ, అందుకు ఛార్జీలు కడుతున్న సందర్భాలూ ఉన్నాయి.**

**ఈ నేపథ్యంలోనే ఆర్‌బీఐ ఏటీఎం లావాదేవీలపై స్పష్టతనిచ్చింది.**

## నగదేతర, విఫల లావాదేవీలపై ఆర్‌బీఐ స్పష్టత

సాధారణంగా బ్యాంకులు నెలలో నిర్దిష్ట సంఖ్యలో ఏటీఎమ్ లావాదేవీలను ఉచితంగా అందిస్తాయి. ఆ పైన జరిపే వాటికి ఛార్జీలు విధిస్తుంటాయి. అయితే బ్యాలెన్స్ ఎంతుందో చూసుకోవడం, చెక్ పుస్తకం కోసం విజ్ఞప్తి పెట్టడం, పన్నుల చెల్లింపులు, నిధుల బదిలీ వంటి నగదేతర లావాదేవీలను.. బ్యాంకులు ఎట్టిపరిస్థితుల్లోనూ ఉచిత ఏటీఎమ్ లావాదేవీల కింద లెక్కపెట్టరాదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. పైన పేర్కొన్న నగదేతర లావాదేవీలు విఫలం అయినా కూడా వాటిని కూడా ఉచిత లావాదేవీల సంఖ్య కింద చూపించరాదని పేర్కొంది. ఉచిత లావాదేవీలు పూర్తయ్యాయి కనుక, తదుపరి లావాదేవీలపై ఛార్జీ విధిస్తామంటే కుదరదని స్పష్టం చేసింది.



చాలా సందర్భాల్లో సాంకేతిక కారణాల వల్ల, ఏటీఎమ్‌లలో నగదు లభ్యత లేనందున, విఫల లావదేవీలను సైతం బ్యాంకులు ఉచిత లావాదేవీల సంఖ్య కింద లెక్కించి.. ఆ పైన జరిపే వాటిపై ఛార్జీలు విధిస్తున్న ఉదంతాలు ఆర్‌బీఐ దృష్టికి వచ్చాయి. దీంతో తాజాగా విడుదల చేసిన సర్క్యులర్‌లో వీటిపై స్పష్టతనిచ్చింది. ఆర్‌బీఐ అందులో ఏం చెప్పిందంటే..

- ✦ సాంకేతిక కారణాలతో అంటే.. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, కమ్యూనికేషన్ సమస్యల వల్ల ఏదైనా లావాదేవీ విఫలమైతే దానిని ఏటీఎమ్ లావాదేవీ జరిగినట్లుగా లెక్కించరాదు.
- ✦ ఏటీఎమ్‌లలో ఒక్కోసారి డబ్బులు ఉండవు. అపుడు నగదు ఉపసంహరణకు ప్రయత్నిస్తే అది విఫల లావాదేవీగా అవుతుంది. కాబట్టి దానిని కూడా ఏటీఎమ్ లావాదేవీగా చూడరాదు.
- ✦ పిన్ నంబరు తప్పుగా కొట్టినపుడు జరిగే విఫల లావాదేవీని కూడా లెక్కలోకి తీసుకోరాదు. ఉచిత లావాదేవీల సంఖ్యలో కలపరాదు.
- ✦ మొత్తం మీద పై కారణాల వల్ల జరిగే విఫల ఏటీఎమ్ లావాదేవీలపై బ్యాంకులు ఛార్జీలు విధించ కూడదు..
- ✦ నగదు ఎంత ఉందో చూసుకోవడం, చెక్ పుస్తకం కోసం విజ్ఞప్తి పంపడం, పన్నుల చెల్లింపు, నగదు బదిలీల వంటి వాటిని ఉచిత ఏటీఎమ్ లావాదేవీల సంఖ్యలో చూపరాదు. అంటే అవి లావాదేవీల కిందకు రావన్నమాట.

ప్రస్తుతం ఎస్‌బీఐ తన పొదుపు ఖాతాదార్లకు నెలలో 8 ఉచిత లావాదేవీలను అందిస్తోంది. అందులో 5 ఎస్‌బీఐ ఏటీఎమ్‌లలో. మరో మూడింటిని ఇతర బ్యాంకుల ఏటీఎమ్‌లలో లెక్కగడుతోంది. మెట్రోయేతర నగరాల్లో పొదుపు ఖాతాదార్లకు మాత్రం 10 ఉచిత లావాదేవీల (అయిదు ఎస్‌బీఐ ఏటీఎమ్, ఇతర ఏటీఎమ్‌లో మరో అయిదు)ను అందిస్తోంది. ఆ పైన వాటిపై ఛార్జీలు వసూలు చేస్తోంది.

## బ్యారెల్ చమురు 58 డాలర్ల దిగువకు

### మాంద్యం ఆందోళనల వల్లే

న్యూయార్క్: ముడిచమురు ధరలపై అమెరికా మాంద్యం భయాల ప్రభావం పడింది. గురువారం 3% తగ్గి, బ్యారెల్ చమురు ధర.. 58 డాలర్ల దిగువకు చేరింది. అమెరికాలో ముడిచమురు నిల్వలు అనూహ్యంగా పెరగడం కూడా ఇందుకు తోడైంది. అమెరికా మాంద్యంలోకి దిగజారొచ్చన్న ఆందోళనలు చమురు గిరాకీ తగ్గడానికి కారణమయ్యాయి. 2007 తర్వాత అమెరికా ట్రెజరీ బాండ్ల రాబడులు తిరోగమించాయి. అయితే 2019 జనవరిలో చూస్తే బ్రెంట్ ధర 10% వరకు పెరిగింది. రష్యా సహా ఒపెక్ దేశాలు చమురు ఉత్పత్తి కోత విధించడంతో ధరలు స్థిరంగా పెరిగాయి.

## టారిఫ్‌లు మేమూ పెంచుతాం

### అమెరికా ప్రతిపాదనలపై చైనా హెచ్చరిక

బీజింగ్: తమ వాణిజ్యం, సాంకేతికతను ఇబ్బంది పెట్టే దిశగా నిర్ణయాలు తీసుకుంటే ప్రతిచర్య ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికాను చైనా హెచ్చరించింది. 'మా దిగుమతులపై అదనపు పన్నులు వేస్తే, అందుకు ప్రతిగా తీవ్ర చర్యలు తీసుకునేందుకు మేం వెనకాడబోము' అని చైనా మంత్రివర్గం పేర్కొంది. అయితే పూర్తి వివరాలు బహిర్గతపర్చలేదు. చైనా నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై సెప్టెంబరు 1 నుంచి అదనంగా మరో 10% సుంకం విధించాలని అనుకుంటున్నట్లు ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించిన సంగతి తెలిసిందే.



# అలో వాహనా..!

## అమ్మకాలు లేక ఉత్పత్తి తగ్గిస్తున్న కంపెనీలు

● ప్రయాణికుల వాహనాల్లో 13% క్షీణత ● ద్విచక్ర వాహనాల ఉత్పత్తిలో 10% కోత
● పరిస్థితి మారకుంటే 10 లక్షల ఉద్యోగాలకు ముప్పు!

దేశీయంగా వాహన తయారీ సంస్థలు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. అమ్మకాలు తగ్గి, నిల్వలు పేరుకుపోతున్నందున ఉత్పత్తిలో కోత విధిస్తున్నాయి. ప్రయాణికుల వాహన (పీవీ) ఉత్పత్తి ఏడాది క్రితంతో పోలిస్తే, ఈ ఏప్రిల్-జులై నెలల్లో 13.18 శాతం క్షీణించింది. అగ్ర తయారీ సంస్థలైన మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, ఫోర్డ్, టయోటా, హోండా తమ ఉత్పత్తిని గణనీయంగా తగ్గించాయి. ఫలితంగా వాహనాల ఉత్పత్తి క్షీణించిందని భారత వాహన తయారీదారుల సంఘం (సియామ్) వెల్లడించింది. ఇదే సమయంలో హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్ఎంఐఎల్), ఫోక్స్‌వ్యాగన్ ఇండియా సంస్థలు మాత్రం ఉత్పత్తిని స్వల్పంగా పెంచాయని పేర్కొంది. సియామ్ గణాంకాల ప్రకారం..

- ✦ ఏప్రిల్-జులై మధ్య మొత్తం ప్రయాణికుల వాహనాల (పీవీ) ఉత్పత్తి 12,13,281కు తగ్గింది. క్రితం ఏడాది ఇదే సమయంలో ఉత్పత్తి చేసిన 13,97,404 వాహనాలతో పోలిస్తే ఇది 13.18 శాతం తక్కువ.
- ✦ మారుతీ సుజుకీ ఉత్పత్తి 18.06 శాతం క్షీణించి 5,32,979 ప్రయాణికుల వాహనాలకు పరిమితమైంది.
- ✦ మహీంద్రా అండ్ మహీంద్రా ఉత్పత్తి 10.65 శాతం తగ్గి 80,679 వాహనాలకు, ఫోర్డ్ ఇండియా ఉత్పత్తి 25.11 శాతం క్షీణించి 71,348 వాహనాలకు పరిమితమయ్యాయి.
- ✦ టాటా మోటార్స్ ఉత్పత్తి 20.37 శాతం తగ్గి 59,667 వాహనాలకు, హోండా కార్స్ ఇండియా ఉత్పత్తి 18.86 శాతం తగ్గి 47,043 వాహనాలకు పరిమితమయ్యాయి.
- ✦ టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎమ్) తమ ఉత్పత్తిని 20.98 శాతం తగ్గించి 45,491 వాహనాలకు పరిమితం చేసింది.
- ✦ మరోవైపు, పీవీ విభాగంలో అతి పెద్ద రెండో ఉత్పత్తిదారు అయిన హెచ్ఎంఐఎల్ మాత్రం ఉత్పత్తిని స్వల్పంగా 1.77 శాతం పెంచింది. 2,39,671 వాహనాలను తయారు చేసింది.
- ✦ ఫోక్స్‌వ్యాగన్ ఇండియా ఉత్పత్తి కూడా 1.05 శాతం పెరిగి, 36,929 వాహనాలకు చేరింది.


### ద్విచక్ర వాహన విభాగంలో..

- ✦ ద్విచక్ర వాహన విభాగంలోనూ ఏప్రిల్-జులై మధ్యలో మొత్తం ఉత్పత్తి 9.96 శాతం క్షీణించి 78,45,675 వాహనాలకు పరిమితం అయ్యింది. క్రితం ఏడాది ఇదే సమయంలో ద్విచక్ర వాహనాల ఉత్పత్తి 87,13,476 కావడం గమనార్హం.
- ✦ హీరో మోటోకార్ప్ ఉత్పత్తి 12.03 శాతం తగ్గి 24,66,802 వాహనాలకు పరమితమైంది.
- ✦ హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తమ ఉత్పత్తిని 18.5 శాతం తగ్గించి, 19,44,900 వాహనాలకు పరిమితం చేసింది.
- ✦ టీవీఎస్ మోటార్ ఉత్పత్తి 8.07 శాతం తగ్గి 11,54,670 వాహనాలకు పరిమితమైంది.
- ✦ రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహన ఉత్పత్తి 22.35 శాతం క్షీణించింది. 2,40,190 ద్విచక్ర వాహనాలను మాత్రమే ఉత్పత్తి చేసింది.
- ✦ అయితే, బజాజ్ ఆటో మాత్రం ఉత్పత్తిని 4.47 శాతం పెంచి 13,89,396 వాహనాలను తయారు చేసింది. సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా కూడా 24.51 శాతం ఉత్పత్తిని పెంచి 2,83,291 వాహనాలను తయారు చేసింది.

### ఉద్యోగాల్లో కోత

వాహన అమ్మకాలు తగ్గడం వల్ల, తయారీలో కోత విధించడంతో, కంపెనీలు గత మూడు నెలల్లో సుమారు 15,000 మంది సాధారణ, తాత్కాలిక కార్మికులను తొలగించాయి. డీలర్ల సమాఖ్య కూడా గత మూడు నెలల్లో 2 లక్షల మందిని తొలగించినట్లు పేర్కొంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే, సుమారు 10 లక్షల ఉద్యోగాలకు రక్షణ లేకుండా పోయే ప్రమాదం ఉందని విడిభాగాల పరిశ్రమ సమాఖ్య (అక్మా) హెచ్చరించింది.

# ఛాంపియన్



టీమ్‌ఇండియా కోచ్ పదవికి నేడే ఇంటర్వ్యూలు

## రవిశాస్త్రికి అడ్డుందా?

ముంబయి: టీమ్‌ఇండియా కోచ్ పదవి కోసం ఇంటర్వ్యూలకు రంగం సిద్ధమైంది. కపిల్‌దేవ్, అన్షుమన్ గైక్వాడ్, శాంత రంగస్వామిలతో కూడిన బీసీసీఐ క్రికెట్ సలహా కమిటీ శుక్రవారమే అభ్యర్థులతో ముఖాముఖి నిర్వహించనుంది. ఈ కమిటీ ప్రస్తుత కోచ్ రవిశాస్త్రితో పాటు టామ్ మూడీ, మైక్ హెసన్, ఫిల్ సిమన్స్, రాబిన్ సింగ్, లాల్‌చంద్ రాజ్‌పుత్‌లను ఇంటర్వ్యూలకు ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. అయితే రేసులో ఎందరున్నా.. రవిశాస్త్రికే మళ్లీ కోచ్ పదవి దక్కొచ్చన్న ఊహాగానాలు గట్టిగా వినిపిస్తున్న నేపథ్యంలో మిగిలిన అభ్యర్థులు కమిటీని ఏమేరకు మెప్పించే ప్రయత్నం చేస్తారన్నది ఆసక్తికరం. కెప్టెన్ కోహ్లి బహిరంగంగానే రవిశాస్త్రికి తన మద్దతు ప్రకటించాడు. కమిటీ సభ్యుడైన అన్షుమన్ గైక్వాడ్ సైతం అతడి పట్ల సానుకూలత వ్యక్తం చేశాడు. రవిశాస్త్రి కోచ్‌గా ఉన్న కాలంలో టీమ్‌ఇండియా రికార్డు బాగుండటం కూడా అతడికి కలిసొచ్చే అంశం. అభ్యర్థుల్లో ఒకరిద్దరు మినహా నేరుగా ఇంటర్వ్యూలు హాజరయ్యే అవకాశాలు లేవు. వెస్టిండీస్ పర్యటనలో ఉన్న రవిశాస్త్రి స్కైప్ ద్వారా కమిటీతో మాట్లాడతాడు. విదేశీ అభ్యర్థులు సైతం ఇలాగే ఇంటర్వ్యూల్లో పాల్గొనే అవకాశముంది. ఇంటర్వ్యూలు అయ్యాక రెండు మూడు రోజుల్లోపే కోచ్ ఎవరన్నది ప్రకటిస్తారు.

## ధోని సైనిక విధులు ముగిశాయ్!



లద్దాఖ్: క్రికెట్‌కు విరామం ఇచ్చి సైనిక విధుల్లో పాల్గొంటున్న టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని.. స్వాతంత్ర్య దినోత్సవం నాడు లద్దాఖ్‌లోని సైనిక ఆసుపత్రిలో జవానులతో గడిపాడు. పారాచ్యూట్ రెజిమెంట్‌లో గౌరవ లెఫ్టినెంట్ హోదాలో ఉన్న మహి.. సహచర జవాన్లతో కలిసి బుధవారమే లద్దాఖ్‌కు చేరుకున్నాడు. స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఇక్కడి సైనిక ఆసుపత్రిలో జవాన్లతో ముచ్చటించాడు. అతను సియాచిన్ యుద్ధ వీరులకు నివాళి అర్పించేందుకు వెళ్తున్నట్లు కూడా వార్తలొచ్చాయి. గురువారంతోనే ధోని తాత్కాలిక విధులు ముగిశాయి. అతను శుక్రవారం దిల్లీకి వచ్చి.. అక్కడి నుంచి స్వస్థలం రాంచికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

**1**

ఒక దశాబ్దకాలంలో 20 వేల అంతర్జాతీయ పరుగులు చేసిన తొలి బ్యాట్స్‌మన్‌గా కోహ్లి ఘనత సాధించాడు. అతడు మూడు ఫార్మాట్లలో కలిపి ప్రస్తుత దశాబ్దంలో 20,018 పరుగులు సాధించాడు. కెరీర్‌లో మొత్తం అతడు 20,502 పరుగులు చేశాడు. కోహ్లి 2010లో టెస్టు, టీ20 అరంగేట్రం చేశాడు. అప్పటికే అతడు వన్డేల్లో (2008 నుంచి) 484 పరుగులు సాధించాడు. ఇప్పటివరకు ఒక దశాబ్దకాలంలో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా రికీ పాంటింగ్ (18,962) ఉన్నాడు.

**9**

వెస్టిండీస్‌తో ఆడిన గత తొమ్మిది ద్వైపాక్షిక సిరీస్‌లు అన్నింటిలోనూ భారత్‌దే విజయం.

**43**

కోహ్లి వన్డే శతకాల సంఖ్య. కెప్టెన్‌గా 21వది.

**9**

వెస్టిండీస్‌పై కోహ్లి శతకాలు. ఒక జట్టుపై వన్డేల్లో అత్యధిక శతకాలు సాధించిన బ్యాట్స్‌మన్‌గా అతడు సచిన్ (ఆస్ట్రేలియాపై 9) రికార్డును సమం చేశాడు.

## శతక్కొట్టేశాడు మళ్లీ..

- కోహ్లి మరో సెంచరీ
- 2-0తో సిరీస్ భారత్ సొంతం



కోహ్లి (114 నాటౌట్)

పోర్ట్ ఆఫ్ స్పెయిన్

కోహ్లి (114 నాటౌట్; 99 బంతుల్లో 14×4), వరుసగా రెండో శతకం బాదేయగా.. శ్రేయస్ అయ్యర్ (65; 41 బంతుల్లో 3×4, 5×6) మరోసారి అదరగొట్టాడు. ఫలితంగా వెస్టిండీస్‌తో చివరిదైన మూడో వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఛేదనలో ఇబ్బందులు ఎదుర్కొన్నా చివరికి సౌకర్యంగానే నెగ్గింది. వర్షంతో చాలా ఆట వృథా కావడంతో ఇన్నింగ్స్‌ను 35 ఓవర్లకు కుదించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండీస్.. గేల్ (72), లూయిస్ (43), పూరన్ (30) చెలరేగడంతో 7 వికెట్లకు 240 పరుగులు చేసింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో సవరించిన 255 పరుగుల లక్ష్యాన్ని భారత్ 32.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కోహ్లి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు గెలుచుకున్నాడు.

ఛేదనలో విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్‌ల భాగస్వామ్యమే హైలైట్. ఓపెనర్ రోహిత్ (10) వికెట్‌ను త్వరగానే కోల్పోయినా కోహ్లి, ధావన్ చక్కగా బ్యాటింగ్ చేయడంతో భారత్ 13వ ఓవర్లో 91/1తో మెరుగైన స్థితిలో నిలిచింది. కానీ ఒక్క పరుగు తేడాలో ధావన్, రిషబ్ పంత్ (0) ఔట్ కావడంతో భారత్ కాస్త ఇబ్బందుల్లో పడ్డట్లు కనిపించింది. కానీ చక్కగా ఆడుతున్న కోహ్లికి తోడైన శ్రేయస్ అయ్యర్.. ధనాధన్ ఇన్నింగ్స్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అలెన్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్స్‌లు దంచిన అతడు.. వెంటనే చేజ్ బౌలింగ్‌లోనూ ఓ సిక్స్ కొట్టాడు. ఏ దశలో దూకుడు తగ్గించలేదు. కోహ్లి కూడా చక్కని బ్యాటింగ్ కొనసాగించడంతో భారత్ వడివడిగా లక్ష్యం దిశగా సాగింది. అయితే 29వ ఓవర్లో జట్టు స్కోరు 212 వద్ద శ్రేయస్ ఔట్ కావడంతో 120 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అయినా భారత్‌కు పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేకపోయింది. బాధ్యతాయుతంగా ఆడిన కోహ్లి.. జాదవ్ (19 నాటౌట్)తో కలిసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఈ క్రమంలో వన్డేల్లో 43వ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. రెండు జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఈ నెల 22న ఆరంభమవుతుంది.

వెస్టిండీస్ ఇన్నింగ్స్: 240/7 (గేల్ 72, లూయిస్ 43, పూరన్ 30; ఖలీల్ 3/68, షమి 2/50); భారత్ ఇన్నింగ్స్: 256/3 (కోహ్లి 114 నాటౌట్, శ్రేయస్ అయ్యర్ 65, ధావన్ 36; అలెన్ 2/40)



## 4 ఇక అయ్యర్‌దేనా!

నంబర్ 4. టీమ్‌ఇండియాను వేధిస్తున్న దీర్ఘకాలిక సమస్య. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ స్థానానికి సరైన బ్యాట్స్‌మన్ మాత్రం దొరకట్లేదు. ఇప్పుడు పంత్ కూడా నిరాశపరుస్తున్నాడు. అదే సమయంలో ఐదో స్థానంలో వస్తున్న శ్రేయస్ అయ్యర్ వెస్టిండీస్‌పై సూపర్ ఇన్నింగ్స్‌లు ఆడడంతో నాలుగో స్థానానికి అతడే సరైన బ్యాట్స్‌మన్ అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కోహ్లి స్పందించాడు. అతడు ఇలాగే బాధ్యతాయుతంగా ఆడితే భారత మిడిల్ ఆర్డర్‌లో సుస్థిర స్థానం దక్కించుకుంటాడని అన్నాడు. కోహ్లి రెండు వరుస సెంచరీలతో జట్టు 2-0 సిరీస్ విజయంలో ముందు నిలవగా.. సంయమనంతో కూడిన దూకుడుతో వరుసగా 71, 65 పరుగులు చేసి ఆ విజయాల్లో శ్రేయస్ కూడా కీలక పాత్ర పోషించాడు. కోహ్లి-శ్రేయస్ క్లిష్టపరిస్థితుల్లో రెండో వన్డేలో 125, మూడో వన్డేలో 120 పరుగులు జోడించారు. "రెండు మ్యాచ్‌ల్లోనూ శ్రేయస్ నాతో కలిసి బ్యాటింగ్ చేశాడు. అతడేమీ భయపెట్టేలా ఆడడు. కానీ చాలా ఆత్మవిశ్వాసంతో ఉంటాడు. సాధికారికంగా ఆడతాడు. ఏ దశలోనూ అతడు ఔటయ్యేలా కనపడలేదు. చాలా సంతోషంగా ఉంది" అని కోహ్లి అన్నాడు. "శ్రేయస్ జట్టు కోసం ఈ చక్కని ప్రదర్శన కొనసాగిస్తాడని ఆశిస్తున్నా. మూడో వన్డేలో మేం కాస్త ఒత్తిడిలో పడ్డాం. కానీ అయ్యర్ ఆట స్వరూపాన్ని మార్చేశాడు. అతడు నాపై ఒత్తిడిని పూర్తిగా తొలగించాడు. దాంతో నాదైన శైలిలో ఆడగలిగా'' అని కోహ్లి అన్నాడు. "క్లిష్ట పరిస్థితుల్లో ఆడడంలో ఉన్న విలువను శ్రేయస్ అర్థం చేసుకున్నాడు. అది అతడి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. కెరీర్ ఆరంభంలోనే నేను అతడి లాగే ఉండేవాణ్ని. ఎప్పుడు అవకాశం వచ్చినా జట్టును గెలిపించాలని అనుకునేవాణ్ని. శ్రేయస్ ఒత్తిడిలోనూ ధైర్యంగా ఆడాడు" అని చెప్పాడు. నియంత్రణతో కూడిన దూకుడుతో శ్రేయస్ బాధ్యతాయుతంగా ఆడుతున్న తీరు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఎంతో కీలకమైన నాలుగో స్థానానికి అతడే సరైన వ్యక్తి అన్న భావన చాలా మందిలో కలుగుతోంది. మాజీ కెప్టెన్ గావస్కర్ కూడా శ్రేయసే ఆ స్థానానికి తగిన బ్యాట్స్‌మన్ అని అంటున్నాడు. పరిణతి లోపించిన పంత్.. నిర్లక్ష్యమైన షాట్లతో వికెట్ పారేసుకుంటున్న నేపథ్యంలో కాస్త ముందో వెనుకో శ్రేయస్‌కు 'నాలుగు' దక్కడం ఖాయంగానే కనిపిస్తోంది.




## ఇంగ్లాండ్‌కు మళ్లీ పంచ్

- యాషెస్ రెండో టెస్టులో 258 ఆలౌట్
- విజృంభించిన ఆసీస్ బౌలర్లు

లండన్: యాషెస్ తొలి టెస్టులో కంగుతిన్న ఇంగ్లాండ్.. తర్వాతి మ్యాచ్‌లోనూ మెరుగు పడలేదు. రెండో టెస్టులో టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 258 పరుగులకే ఆలౌటైంది. వర్షం వల్ల తొలి రోజు ఆట తుడిచిపెట్టుకుపోగా.. బౌలర్లకు అనుకూలంగా మారిన పరిస్థితుల్ని సద్వినియోగం చేసుకుంటూ గురువారం ఆస్ట్రేలియా బౌలర్లు చెలరేగారు. ప్యాటిన్సన్ గాయపడటంతో తుది జట్టులోకి వచ్చిన జోష్ హేజిల్‌వుడ్ (3/58) మూడు కీలక వికెట్లతో ప్రత్యర్థి పతనంలో కీలక పాత్ర పోషించాడు. మరో ఫాస్ట్‌బౌలర్ కమిన్స్ (3/61), తొలి టెస్టులో ఇంగ్లాండ్ పతనాన్ని శాసించిన స్పిన్నర్ లైయన్ (3/68) కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. రోరీ బర్న్స్ (53), బెయిర్‌స్టో (52) మినహా బ్యాట్స్‌మెన్ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. హేజిల్‌వుడ్, కమిన్స్‌ల ధాటికి ఇంగ్లాండ్ ఒక దశలో 138 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. అయితే వోక్స్ (32)తో కలిసి బెయిర్‌స్టో ఆదుకోవడంతో స్కోరు 200 దాటింది. ఈ వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్ చివరి వికెట్ రూపంలో వెనుదిరిగాడు. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ 77.1 ఓవర్లలోనే ముగిసింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియా.. ఐదో ఓవర్లోనే వార్నర్ (3) వికెట్ కోల్పోయింది. బాన్‌క్రాఫ్ట్ (5 బ్యాటింగ్), ఖవాజా (18 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. ఆసీస్ 30/1తో రెండో రోజు ఆటను ముగించింది.

## గేల్ రిటైరవ్వలేదట!



క్రిస్ గేల్ మైదానంలోకి వస్తున్నపుడు ఒకటే కేరింతలు.. బ్యాటింగ్ చేస్తున్నంతసేపూ అవి కొనసాగాయి.. ఔటై వెనుదిరుగుతున్నపుడు భారత ఆటగాళ్లు గౌరవ వీడ్కోలు చెప్పారు. అభిమానులు లేచి నిలబడి చప్పట్లు కొట్టారు.. గేల్ కూడా బ్యాటుతో అభివాదం చేస్తూ పెవిలియన్‌కు చేరాడు.. తర్వాత భారత ఇన్నింగ్స్ సందర్భంగా గేల్ మైదానంలో ఉన్నంతసేపు, మ్యాచ్ అయిపోయి వెళ్తున్నపుడు ఒకటే హంగామా..! ప్రపంచకప్‌తోనే రిటైరవుతానని ప్రకటించి.. ఆపై భారత్‌తో సిరీస్ ఆడాలని ఉందంటూ గేల్ ఇంతకుముందు చేసిన ప్రకటన.. బుధవారం మ్యాచ్‌లో పరిణామాల్ని దృష్టిలో ఉంచుకుని.. అందరూ అతను అంతర్జాతీయ క్రికెట్ నుంచి నిష్క్రమించాడనే అనుకున్నారు. కానీ గేల్ మాత్రం అలాంటిదేమీ లేదంటూ కొట్టిపారేశాడు. మ్యాచ్ అనంతరం వెస్టిండీస్ క్రికెట్ బోర్డు పోస్ట్ చేసిన వీడియోలో.. "నేను రిటైర్మెంట్ లాంటి దాని గురించి ఏమీ ప్రకటించలేదు" అని గేల్ పేర్కొన్నాడు. మరోవైపు మీరింకా క్రికెట్‌లో కొనసాగుతారా అని ఓ విలేకరి ప్రశ్నించగా.. "అవును.. తర్వాతి ప్రకటన వచ్చేవరకు" అని బదులిచ్చాడు గేల్. వెస్టిండీస్ వన్డే కెప్టెన్ జేసన్ హోల్డర్ సైతం గేల్ రిటైరవుతున్నట్లుగా సమాచారమేమీ లేదని చెప్పడం గమనార్హం. "నాకు తెలిసినంత వరకు అతను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరవ్వలేదు" అని మ్యాచ్ అనంతర విలేకరుల సమావేశంలో హోల్డర్ చెప్పాడు.

### గేల్ చాలా మంచోడు: కోహ్లి

ఓవైపు రిటైర్మెంట్ వార్తల్ని గేల్ ఖండిస్తుంటే.. టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లి అతడి గురించి దాదాపుగా ఒక వీడ్కోలు సందేశం ఇచ్చేయడం విశేషం. "వెస్టిండీస్ తరఫున గొప్ప కెరీర్ కలిగిన గేల్‌కు అభినందనలు. తన దేశ క్రికెట్‌కు అతనెంతో చేశాడు. అతనో దిగ్గజ ఆటగాడు. అన్నిటికీ మించి గేల్ చాలా మంచి వ్యక్తి. అదే అతడిలో అత్యంత గొప్ప లక్షణం. ఓ స్నేహితుడిగా గేల్‌తో ఎంతో సమయం గడిపినందుకు నేను అదృష్టవంతుడిని" అని కోహ్లి అన్నాడు.



### వారెవా ఏమి షాట్

22వ ఓవర్లో హోల్డర్ బౌలింగ్‌లో కోహ్లి కవర్ డ్రైవ్ ఆడుతున్న దృశ్యమిది. మిడిల్ స్టంప్ లైన్‌లో గుడ్ లెంగ్త్‌లో పడిన బంతిని ఆడేందుకు కాస్త పక్కకు జరిగి విల్లులా వంగి.. ఫ్రంట్ ఫుట్‌పై కళ్లుచెదిరే కవర్ డ్రైవ్ ఆడాడు కోహ్లి. ఆ సమయంలో వ్యాఖ్యాతగా ఉన్న వివియన్.. కోహ్లిని ప్రశంసలతో ముంచెత్తాడు. "అతడు కదిలిన తీరు చూడండి.. అద్భుతం! మా రోజుల్లో నేను అలా ఆడితే సంతోషించేవాడిని'' అని ప్రశంసించాడు.



## దీపక్ ధనాధన్

### పుణెరిపై జైపుర్ విజయం

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీలో జైపుర్ పింక్ పాంథర్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. గత మ్యాచ్‌లో దిల్లీ చేతిలో ఓడిన జైపుర్ గురువారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో 33-25తో పుణెరి పాంథర్స్‌ను ఓడించింది. కెప్టెన్ దీపక్ నివాస్ హుడా 9 రైడ్ పాయింట్లతో జట్టుకు ఘన విజయాన్ని అందించాడు. డిఫెండర్లు నితిన్ (4), సందీప్ (4) అతడికి సహకరించారు. ఆరంభంలో పుణెరి గట్టి పోటీ ఇచ్చింది. అయితే దీపక్ వ్యూహం ముందు ఆ జట్టు ఆటలు సాగలేదు. అటు రైడింగ్‌లో, ఇటు డిఫెండింగ్‌లో తిరుగులేని ప్రదర్శన చేసిన జైపుర్ 16వ నిమిషంలోనే ప్రత్యర్థిని ఆలౌట్ చేసింది. ప్రథమార్ధం ముగిసేసరికి 17-11 పాయింట్ల ఆధిక్యంలో ఉన్న దీపక్ సేన.. ఆట ఆఖరి వరకు అదే జోరు కొనసాగించి విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మొత్తం ఆరు మ్యాచ్‌ల్లో 5 విజయాలు సాధించిన పుణెరి పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది.

**ప్రొ కబడ్డీలో ఈనాడు**

యు ముంబ × పట్నా - రాత్రి 7.30 నుంచి

గుజరాత్ × జైపుర్ - రాత్రి 8.30 నుంచి

## కివీసూ తిప్పేసింది

తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 227/7



అజాజ్

గాలె: స్పిన్ మాయాజాలానికి ఇబ్బంది పడ్డ న్యూజిలాండ్.. శ్రీలంకను స్పిన్‌తోనే దెబ్బతీసింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ అజాజ్ పటేల్ (5/76) విజృంభించడంతో తడబడిన లంక జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 227/7తో పోరాడుతోంది. ప్రత్యర్థి స్కోరు కన్నా ఆ జట్టు 22 పరుగులు వెనకబడి ఉంది. ఓపెనర్లు తక్కువ స్కోరుకే వెనుదిరిగినా.. కుశాల్ మెండిస్ (53; 89 బంతుల్లో 7×4, 1×6), మాథ్యూస్ (50; 98 బంతుల్లో 7×4, 1×6) అర్ధసెంచరీలు చేసి లంక ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. ఒక దశలో ఆ జట్టు 143/2తో మెరుగ్గా కనిపించింది. అయితే అజాజ్ ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన లంక 161/7తో కష్టాల్లో పడింది. ఈ దశలో డిక్వెలా (39 బ్యాటింగ్), లక్మల్ (28 బ్యాటింగ్) ఆదుకున్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 203/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్.. 249 పరుగులకే ఆలౌటైంది. రాస్ టేలర్ (86) ఉదయం త్వరగా ఔట్ కావడంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ వేగంగా ముగిసింది. లంక బౌలర్లలో ధనంజయ (5/80), (4/29) సత్తా చాటారు.

### నైట్‌రైడర్స్ కోచ్‌గా మెక్‌కలమ్

ముంబయి: న్యూజిలాండ్ మాజీ విధ్వంసక ఓపెనర్ బ్రెండన్ మెక్‌కలమ్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ తమ కోచ్‌గా నియమించుకుంది. 2020 ఐపీఎల్ సీజన్లో బ్రెండన్ కేకేఆర్ కోచ్‌గా బాధ్యతలు చేపడతాడు. 2008-10, 2012-13 సీజన్లలో మెక్‌కలమ్ నైట్‌రైడర్స్ తరఫున ఆడాడు.

### భారత మాజీ క్రికెటర్ వీబీ చంద్రశేఖర్ మృతి

చెన్నై: భారత మాజీ క్రికెటర్ వీబీ చంద్రశేఖర్ (57) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. తమిళనాడుకు చెందిన ఈ ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ భారత్ తరఫున 1988-90 మధ్య కాలంలో ఏడు వన్డేలు ఆడాడు. దేశవాళీ క్రికెట్లో తమిళనాడు జట్టు తరఫున 4,999 పరుగులు చేశాడు. రెస్టాఫ్ ఇండియాతో జరిగిన ఇరానీకప్ మ్యాచ్‌లో చంద్రశేఖర్ 56 బంతుల్లో శతకం బాదాడు. గ్రెగ్ ఛాపెల్ భారత జట్టు కోచ్‌గా ఉన్న సమయంలో సెలక్టర్‌గా సేవలు అందించాడు.

### గాయంతో సాత్విక్ జోడీ ఔట్



దిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ నుంచి సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ జోడీ వైదొలిగింది. "థాయ్‌లాండ్ ఓపెన్ సమయంలో సాత్విక్ భుజానికి గాయమైంది. ఇంకా మానలేదు. నాకూ అదే టోర్నీలో కాలి కండరాలు పట్టేశాయి. అందుకే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాం'' అని చిరాగ్ తెలిపాడు. సోమవారం ఈ టోర్నీ స్విట్జర్లాండ్‌లో ఆరంభం కానుంది.

